
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
జిల్లా వార్తలు


దోపిడీకి.. ఏఐ వల



నిన్నటి వరకు సీబీఐ, లేక ఢిల్లీ పోలీస్‌లమని బెదిరింపు కాల్స్ చేయటం, రిజర్వ్ బ్యాంక్ నుంచి, టెలికమ్ సర్వీసు సంస్థల నుంచి ఫోన్ చేసి సిమ్ బ్లాక్ చేస్తామని, ఖాతాలు స్థంబింపచేస్తామంటూ కాల్స్, మెసేజ్‌లు చేసిన పరిస్థితి ఉండటంతో కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖ జనాన్ని అప్రమత్తం చేసేందుకు ఏకంగా అందరి సెల్ ఫోన్‌లో కాల్ చేసేప్పుడు ఒక కాలర్ టోన్ కింద ఈ మోసాలకు సంబంధించి జాగ్రత్తలు వివరిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు వీటిని కూడా దాటి సరికొత్త మోసాలకు సైబర్ కేటుగాళ్లు సిద్ధమై పోతున్నారు. మన ఫోన్ నుంచి ఏ తరహా ఆర్థిక లావాదేవీ చేసినా, చేసేముందు అప్రమత్తతతో ఉండాలనేది నిపుణుల మాట.

సైబర్ మోసాలపై ప్రభుత్వం ఎంత అవగాహన కల్పించినా... ఒకసారి మోసపోయాం కదా! మరోసారి జాగ్రత్త పడదామని అంతకు మించిన అప్రమత్తతోఉన్నా, సాంకేతికను ఉపయోగించుకుని సైబర్ బూచోళ్లు జనం ఖాతాల్లోని డబ్బును దోచేస్తూనే ఉన్నారు. నిన్నటి వరకు మెసేజ్‌లు, బెదిరింపు కాల్స్ రూపంలో దోచుకున్న సైబర్ దొంగల బండారం అందరికీ తెలిసిపోవటంతో, ఆ తరహా మోసాల స్థానంలో కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. తాజాగా ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో నయా మోసాలకు బరి తెగిస్తున్నారు. దీంతో సాంకేతికత తెలిసిన వారు, గత అనుభవాలున్న వారూ ఈ ఏఐ తరహా దోపిడీ వలలో చిక్కుకు పోతున్నారు. రూ. వేలల్లోనే దోపిడీ జరుగుతుండటంతో మోసపోయినవాళ్లు చాలా వరకు మన గ్రహ పాటని మిన్నకుంటుంటే, మరి కొం దరు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు.



డబ్బు దోచేసేందుకు పంపిన మెసేజ్‌లు

- సాంకేతికతను ఉపయోగించి మరిన్ని కొత్త దారుల్లోనూ..
- అమాయకులను మోసం చేసి దోచేస్తున్న సైబర్ బూచోళ్లు
- గ్రహించేలోపే ఖాతాల్లో డబ్బు మాయం
- రోజుకొక కొత్త మోసంతో జనం భయం భయం

తెనాలి, ఫిబ్రవరి 03, (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన ఓ వ్యాపారి కుటుంబంలో పెద్దకుమారుడు సురేష్ ఢిల్లీలో గ్రూప్స్ రాసేందుకు కోచింగ్ సెంటర్‌లో చదువుకుంటున్నాడు. నా ఫోన్ పోయిందని, డబ్బంతా ఎకౌంట్‌లోనే ఉండటం, యూపీఐ యాప్‌లు ఫోన్‌లో ఉండటంతో ఇబ్బందిగా ఉందని, కొత్త ఫోన్ కొనుక్కునేందుకు రూ. 40 వేలు పంపాలంటూ తండ్రికి ఒక ఫోన్ వచ్చింది. మిత్రుని ఫోన్ నుంచి వాట్సప్ కాల్ చేస్తున్నానని చెప్పి తమ కుమారుడే వీడియో కాల్‌లో మాట్లాడటంతో ఆ తండ్రి ఖంగుతిన్నాడు. తీరా అసలు విషయమేమంటే... ఫోన్ పోయిందని, డబ్బులు పంపాలంటూ వీడియో కాల్‌తో మాట్లాడిన కుమారుడు ఆ సమయంలో ఆయన పక్కన ఉండటమే. వారం క్రితమే ఓ స్థలం రిజిస్ట్రేషన్ కోసం ఎక్కడెక్కడో ఉన్న ఆయన కుటుంబ సభ్యులంతా ఇంటికి వచ్చారు. కుమారుడు పక్కనే ఉండగా మరో నంబర్ నుంచి అచ్చం తన కుమారుడే మాట్లాడుతున్నట్టు వీడియో కాల్ రావటంతో అప్రమత్తమైన ఆ తండ్రి వెంటనే సమాచారాన్ని 1930 నంబర్‌కు అందించారు. ఆ తర్వాత వారికి ఏఐ సాంకేతికతను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు ఫేక్ వీడియో కాల్‌తో వల విసిరారనే విషయం తెలిసింది. అదే సమయంలో కుమారుడు ఇంటిలో లేకుంటే ఆ తండ్రి డబ్బు పంపి మోసపోయేవారే. ఇదే తరహాలో గడచిన పది రోజుల నుంచి ఏఐ యాప్‌ల ద్వారా ఫేక్ వీడియోలు తయారుచేసి ఫోన్ చేస్తుండటం ఒక సంచలనమైతే, అసలు తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్‌లు, వారి సంబంధాలు మోసగాళ్లకు ఎలా తెలుస్తున్నాయనేది అంతుబట్టని ప్రశ్న. ఫోన్ చేసే వ్యక్తి ఎక్కడ ఉంటున్నారనేదికానీ, ఏం చేస్తున్నారనేదికానీ కాల్ మాట్లాడేటప్పుడు ప్రస్తావనకు రావటంలేదని, అయితే కుమారుడా? కుమార్తె, లేక ఇతర బంధుత్వాలా అనేది వరసలు మాత్రం కచ్చితంగా చెబుతున్నారనేది బాధితులు చెబుతున్న మాటలతో అర్థమవుతోంది. ఒకరిద్దరికి మాత్రం సంబంధంలేని వరసలు కలిపి మాట్లాడటంతో వారు తమ కుమారుడు కాదని, అల్లుడని చెప్పటం, తర్వాత వారికి వచ్చింది ఫేక్ కాల్ అని తెలుసుకుని అప్రమత్తమయిన పరిస్థితి ఉందంటే, పెద్ద ఫోన్‌లు వాడే వారిలో సాంకేతికత గురించి పెద్దగా తెలియనివారికి కనుక ఫోన్ వస్తే వారు మోసపోయినట్టే.

అయితే మన ఖాతాకు ఏదైనా నగదు జమ అయినా వెంటనే యూపీఐ యాప్‌లలో చూడటం కాకుండా, సంబందిత బ్యాంక్ ఫోన్ యాప్‌ల ద్వారా చెక్ చేసుకుంటే సురక్షితంగా ఉంటుందని, లేక ఏదైనా మెసేజ్ వచ్చిన వెంటనే కాకుండా కొంత సమయం వేచి ఉంటే, సైబర్ మోసగాళ్ల మరో ఖాతా పనిలో ఉండటం వల్ల మనకు వెంటనే రిక్వెస్ట్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని, ఇటువంటి జాగ్రత్తలతో వారి పే రిక్వెస్ట్‌ల మోసాల నుంచి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్న మాట. ఇది కాక... అనేక రూపాల్లో కొత్త తరహా మోసాలకు సైబర్ బూచోళ్లు తెగబడుతూనే ఉన్నారు. మన ప్రాంతాల్లో జరగకున్నా, రాష్ట్రంలో పలుచోట్ల మోసాలు జరుగుతున్నాయంటూ కాల్ ఫార్వర్డ్ తరహాలో జరుగుతున్న దోపిడీపైనా వీడియోలు వైరల్ అవుతున్నాయి. అపరిచితులు తమ ఫోన్ చార్జింగ్ అయిపోయిందని, లేక బ్యాలెన్స్ లేదని, ఒక ఫోన్ చేసుకుని ఇస్తానని అడిగి మన ఫోన్ తీసుకుని దానిలో 'స్టార్ 401 హ్యాష్' తర్వాత వారి ఫోన్ నంబర్ టైప్‌చేసి మన ఫోన్‌లో కాల్ కొడితే మన ఫోన్‌కు వచ్చే కాల్స్, ఓటీపీలు, పాస్వర్డ్‌లు వారి నంబర్‌కు ఫార్వర్డ్ అవుతాయని, దీనిద్వారా మన ఖాతాలో డబ్బు సునాయాసంగా వారు దోచేసే అవకాశం ఉందంటూ ఒక పోలీస్ అధికారి డ్రెస్‌లో వ్యక్తి చైతన్యం కలిగించేలా ఒక వీడియో వైరల్ అవుతోంది.

చిన్న మొత్తంలో డబ్బు ఎరవేసి.. పెద్ద మొత్తం కొట్టేసి..

మన ఖాతాకు డబ్బు జమ అయినట్టు మెసేజ్ వస్తే మనకు ముందుగా గుర్తొచ్చేది ఫోన్‌పే, గూగుల్‌పే కానీ, యూపీఐ యాప్‌లే. వాటిని ఓపెన్ చేసి బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలనే ఆలోచనచేస్తారెవరైనా. ఈ అలవాటు ను దోపిడీకి బలహీనతగా ఉపయోగించుకుని మరికొందరు వల వి సురుతున్నారు. ముందుగా మన ఖాతాకు రూ. 200 కానీ, రూ. 2వేలు కానీ, పంపటం, లేక పంపినట్టు ఒక మెసేజ్ పంప టం వీరుచేసే మోసంలో తొలి ప్రయత్నం. డబ్బు రాగానే ఫోన్‌పే ద్వారా బ్యాలెన్స్ చెక్‌చేసుకోటానికి ప్రయత్నించేలోపే యూపీఐ యాప్‌లకు మనమే డబ్బు పంపటానికి ఒక రిక్వెస్ట్ మోసగాళ్ల నుంచి రావటం, యాదృచ్ఛికంగా దానిని ఓపెన్‌చేసి, బ్యాలెన్స్ చూస్తున్నామన్న ఆలోచనతో కానీ, తొందరపాటుతోకానీ మన యూపీఐ యా ప్ పాస్వర్డ్‌ను ఎంటర్ చేస్తే మన ఖాతాకు డబ్బు రావటం అటుంచి, మన ఖాతాలోని డబ్బు మాయమవటం ఈ మోసం ప్రత్యేకత.



ఏఐ సాయంతో ఫేక్ కాల్ కోసం వీడియో తయారు చేసేందుకు అందుబాటులో ఉన్న యాప్

తెనాలిలో ఓ ప్రముఖ ప్రయివేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న పేరుచెప్పటానికి ఇష్టపడని ఒక ఉద్యోగికి తాజాగా ఇదే పరిస్థితి ఎదురయింది. ఈయన ఖాతాకు రూ. 2,000 జమ అయినట్టు మెసేజ్ రావటంతో వెంటనే తన ఫోన్‌పే యాప్‌లో బ్యాలెన్స్ చెక్ చేసుకునే ప్రయత్నం చేయటం, వెంటనే దానికి రూ. 20,000 ఆయనే పేచెయ్యటానికి వీలుగా మోసగాళ్లనుంచి పేమెంట్ రిక్వెస్ట్ రావటంతో ఆయన దానిపై క్లిక్ చేసి పాస్వర్డ్ కొట్టేయటంతో రూ. 20వేలు ఖాతా నుంచి వెళ్లిపోయాయి. తర్వాత బ్యాలెన్స్ చెక్ చేసుకుంటే రూ. 2వేలు తన ఖాతాలోకి జమ కావటం అటుంచితే, తన ఖాతాలోనే ఉండాల్సిన నగదు నిల్వలోని రూ. 20వేలు వెళ్లిపోవటం కలవరపాటుకు గురిచేసిన పరిస్థితి. యాప్‌లోనే చెల్లింపుల వివరాలు చూస్తే తన డబ్బు పోయిన ఖాతా నంబర్ చివరి అంకెలు కనిపించటంతో అప్రమత్తమయ్యారు. బ్యాంక్ ఉద్యోగి కావటంతో వెంటనే తన ఖాతా నుంచి ఫేక్ ఎకౌంట్‌కు డబ్బు పంపినట్టు, తాను మోసపోయినట్టు తన ఖాతాఉన్న బ్యాంక్ నంబర్‌లకు, మెయిల్స్‌కు ఆ మొత్తం పెండింగ్‌లో పెట్టేలా రిక్వెస్ట్ పంపటం, తర్వాత చేయాల్సిన రికవరీ పనులు బ్యాంకుకు వెళ్లి ప్రయత్నించటంతో రెండు వారాల తర్వాత ఆయన డబ్బు తిరిగి సొంత ఖాతాకు జమ అవటంతో ఊపిరి పీల్చుకున్నారు. అదే బ్యాంకు ఉద్యోగులు, అవగాహన ఉన్న వారు కాకుండా ఇతరులైతే ఆ డబ్బు పోయినట్టే.

వైసీపీ కోటకు బీటలు

- గుంటూరు కార్పొరేషన్‌లో దిగజారిన కార్పొరేటర్ల బలం
- స్టాండింగ్ కౌన్సిల్స్ అన్నీ కూటమి వశం
- ఇక మేయర్‌కు చెక్ పెట్టేందుకు సన్నద్ధం
- పావులు కదుపుతున్న పెమ్మసాని

గుంటూరు నగరపాలక సంస్థలో వైసీపీ కోటకు బీటలు వారాయి.. ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు పెద్ద ఎత్తున కూటమిలో చేరారు.. దీంతో సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో ఆరు స్థానాలనూ కూటమి అభ్యర్థులు కైవశం చేసుకున్నారు. వచ్చే నెల 17వ తేదీతో మనోహర్ నాయుడు మేయర్ పదవి చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తవుతుంది. దీంతో ఆయన పదవికి కూటమి పార్టీ ఎసరు పెట్టనుంది. ఇప్పటికే వైసీపీ కార్పొరేటర్లు పెద్ద ఎత్తున కూటమిలో చేరటంతో ఆ పార్టీ పూర్తిగా బలాన్ని కోల్పోయింది. సెమీఫైనల్స్‌గా జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో కూటమి అభ్యర్థులు భారీ విజయాన్ని సాధించారు. మొత్తం ఆరుగురు సభ్యులలో ఐదు తెలుగుదేశం, ఒకటి జనసేన కైవశం చేసుకుంది. ప్రస్తుత మేయర్ మనోహర్ నాయుడుపై కూడా అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలో వ్యూహాత్మకంగా వ్యవహరించిన కేంద్ర మంత్రి చంద్రశేఖర్ మేయర్ పీఠాన్ని కూటమి ప్రభుత్వం దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.



ఓటు వేయడానికి బస్సులో వస్తున్న టీడీపీ కార్పొరేటర్లతో ఎమ్మెల్యే నసీర్



గెలుపొందిన అభ్యర్థులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్, రామాంజనేయులు.

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థలోని స్టాండింగ్ కమిటీకి సోమవారం జరిగిన ఎన్నిక ఉత్కంఠభరితంగా సాగింది. క్యాంపులకు వెళ్లిన ఇరుపార్టీల కార్పొరేటర్లు హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనాల్లో నేరుగా కార్పొరేషన్‌కు చేరుకున్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ఎన్నిక ఓటింగ్‌లో 11:30 గంటలకు తొలుత కూటమి కార్పొరేటర్లు, తర్వాత 12:15 గంటలకు వైసీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. జీఎంసీ ఎదుట పెద్ద ఎత్తున ఉత్కంఠ నెలకొంది. పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ పెద్ద ఎత్తున ఇరుపార్టీల నాయకులు చేరుకోవడంతో ఉత్కంఠ వాతావరణ ఏర్పడింది. ప్రతి ఐదుగురు కార్పొరేటర్‌లను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి ఓటు హక్కును వినియోగించుకునేందుకు కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోకి అనుమతిచ్చారు. అధికారులు ముందస్తు ప్రణాళికలో భాగంగా వ్యవహరించడంతో పోలింగ్, కౌంటింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. కౌంటింగ్‌ను కూడా ఇరుపార్టీల కార్పొరేటర్ల సమక్షంలో లెక్కించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలో నగరపాలక సంస్థలో ఉన్న 56 మంది కార్పొరేటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో నూరుశాతం కార్పొరేటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనారోగ్యంతో క్యాంపునకు వెళ్లకుండా ఉన్న 43 వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ ఎక్కలూరి మారుతి రాణి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నేరుగా కార్పొరేషన్‌కు వచ్చి కౌన్సిల్ హాల్‌లో ఓటు హక్కు వినియోగించుకుని వెళ్లిపోయారు.

నగరపాలక సంస్థలో వైసీపీ ఒకప్పుడు ఎంతో పటిష్టంగా ఉంది. 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికలలో నగరంలో 57 డివిజన్‌లకు గానూ, వైసీపీ తరఫున 44 మంది కార్పొరేటర్లు ఆ పార్టీ సింబల్ మీద గెలిచారు. 9 మంది కార్పొరేటర్లు టీడీపీ, ఇద్దరు జనసేన, మరో ఇద్దరు గురవయ్య, చల్లా రాజ్యలక్ష్మి స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందారు. ఆ తర్వాత వారిద్దరు వైసీపీలో చేరారు. దీంతో కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్ల సంఖ్య 46కు పెరిగింది. 8వ డివిజన్ కార్పొరేటర్ రమేష్ గాంధీ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ స్థానానికి ఏర్పడ్డ ఖాళీకి ఎన్నికలు నిర్వహించగా, తెలుగుదేశం పార్టీ తరఫున పోతురాజు సమత గెలుపొందారు. దీంతో కౌన్సిల్లో తెలుగుదేశం పార్టీ తరఫున పది మంది కార్పొరేటర్లు అయ్యారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు, తరువాత వైసీపీకి చెందిన అనేక మంది కార్పొరేటర్లు కూటమి ప్రభుత్వంలో చేరారు. దీంతో కార్పొరేషన్‌లో కూటమి కార్పొరేటర్ల బలం 35కు చేరు కుంది. స్టాండింగ్ కమిటీకి జరిగిన ఎన్నికల్లో కూడా ఆరుగురు కూటమి అభ్యర్థులు తిరుగులేని మెజార్టీతో గెలుపొందటం గమనార్హం.



కార్పొరేటర్లతో తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్, మాధవి

అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం

గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబులపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూటమి ప్రభుత్వ నాయకులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, రామాంజనేయులు తదితరులు సమాలోచన చేస్తున్నట్టు తెలిసింది. వాస్తవానికి వచ్చే నెల 17వ తేదీకి మనోహర్ నాయుడు పదవి చేపట్టి నాలుగేళ్లు పూర్తి అ వుతుంది. ఆ తేదీకి వారం ముందుగా అవి శ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతూ ముం దస్తు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలి సింది. కూటమి ప్రభు త్వం ప్రవే శపెట్టే అవిశ్వాస తీర్మా నాన్ని వైసీపీ నాయకులు ఏ విధం గా ఎదుర్కొంటారో వేచి చూడాల్సిందే.

వైసీపీ నుంచి భారీగా క్రాస్ ఓటింగ్

వైసీపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు కూటమి అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తూ భారీగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. దీంతో కూటమి తరఫున పోటీ చేసిన ఆరుగురు అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందారు. కూటమి అభ్యర్థులు స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. వాస్తవానికి కూటమి నేతలు నిర్వహించిన క్యాంపులో 29 మంది కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. వైసీపీలో లెక్కకు 27 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అయితే "ఆంధ్రజ్యోతి" ముందే చెప్పినట్లుగా భారీగానే క్రాస్ ఓటింగ్ జరిగింది. దీంతో కూటమి తరఫున పోటీలో ఉన్న అభ్యర్థులు ఈరంటి వరప్రసాద్‌కి 33 ఓట్లు, దాసరి లక్ష్మీ దుర్గకి 32 ఓట్లు, షేక్ మీరావలికి 32 ఓట్లు, నూకవరపు బాలాజీకి 31 ఓట్లు, కొమ్మినేని కోటేశ్వరరావుకి 31 ఓట్లు, ముప్పవరపు భారతికి 30 ఓట్లు చొప్పున వచ్చాయి. వైసీపీ తరఫున పోటీలో ఉన్న మర్రి అంజలి, గోపి శ్రీనివాస్, రాజలత బూసిలకు 24 చొప్పున ఓట్లు రాగా, ఆ పార్టీకి చెందిన వంశీబాబు, యాట్ల రవికుమార్‌లకు 23 ఓట్లు వచ్చాయి. స్టాండింగ్ కమిటీ నామినేషన్ అప్పుడు వైసీపీ తరఫున నామినేషన్ వేసి, తర్వాత కూటమిలో చేరిన అడకా పద్మావతికి ఒక ఓటు మాత్రమే వచ్చింది. స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో గెలుపొందిన ఆరుగురు కూటమి అభ్యర్థులకు వచ్చిన ఓట్ల మెజార్టీని పరిశీలిస్తే కౌన్సిల్లో వైసీపీ తీవ్రంగా దెబ్బతిన్నట్లు స్పష్టమవుతుంది. ఆ పార్టీకి కార్పొరేటర్లు క్రాస్ ఓటింగే కాకుండా, వెన్నుపోటు కూడా పొడిచినట్టు తెలుస్తుంది. ఆ పార్టీలో మేయర్ మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబుల ఒంటెద్దు పోకడలే అందుకు నిదర్శనంగా తెలుస్తుంది. మేయర్ పనితీరుపై ఆ పార్టీలో కార్పొరేటర్లు తీవ్రస్థాయిలో అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. దీనిని ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతమే స్పష్టం చేస్తుంది.



కార్పొరేషన్‌కి వస్తున్న వైసీపీ కార్పొరేటర్లు



పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు... నోటిఫికేషన్ విడుదల

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మి నోటిఫికేషన్‌ని అధికారికంగా విడుదల చేశారు. అనంతరం నామినేషన్ల స్వీకార ప్రక్రియని ప్రారంభించారు. తొలి రోజున పల్నాడు జిల్లా గురజాల మండలం గంగవరం గ్రామానికి చెందిన కనకం శ్రీనివాసరావు తన నామినేషన్‌ను ఆర్వో నాగలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్వో నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య సమయంలో నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం, వెలుపల పటిష్ట పోలీసు బందోబస్తుని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

అనుబంధ పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలి

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్ని కలకు సంబంధించి ప్రతిపాదించిన అనుబంధ పోలింగ్ స్టేషన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి ఖరారు చేస్తే జాబితాను ప్రధాన ఎన్నికల అధికారికి పంపడం జరుగుతుందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ మీటింగ్ హాల్‌లో

తొలి రోజున ఒక నామినేషన్ దాఖలు

ఆమె తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డీఆర్వో షేక్ ఖాజావలి, గుంటూరు ఆర్డీవో కె శ్రీనివాసరావుతో కలసి పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 118 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిల్లో వెయ్యి ఓట్లకు పైన వున్న పోలింగ్‌స్టేషన్లకు అదనంగా వేరొక పోలింగ్ కేంద్రాన్ని అనుబంధంగా ఏర్పాటు చేసేందుకు 39 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామన్నారు. ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓలతో చర్చించి 8 అనుబంధ పోలింగ్ కేంద్రాలను తగ్గించడం జరిగిందన్నారు. దీని ప్రకారం జిల్లాలో 149 (118+31) పోలింగ్ స్టేషన్ల జాబితాను సీఈవోకు పంపించడానికి ఏఆర్‌ఓలు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మిగిలిన ఏలూరు, కృష్ణ, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు జిల్లాలో అనుబంధ పోలింగ్ కేంద్రాల వివరాలు అందిన తర్వాత మొత్తం పోలింగ్ కేంద్రాలను ప్రకటించడం జరుగుతుందన్నారు. అలానే సోమవారం వరకు నమోదు అయిన ఓటర్లలో పురుషులు 2,06,225 మంది, మహిళలు 1,40,344 మంది, ట్రాన్స్ జెండర్స్ 45 మంది మొత్తం 3,46,614 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు.

యార్డుకు పోటెత్తిన మిర్చి టిక్కీలు

- ఒకే రోజున 1.20 లక్షల టిక్కీల రాక

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు ప్రస్తుత సీజన్‌లో ఒకే రోజున అత్యధిక సంఖ్యలో మిర్చి టిక్కీలు సోమవారం వచ్చాయి. గత శని, ఆదివారం సెలవు దినాలు అనంతరం యార్డు గేట్లు తెరుచుకోవడంతో రాయలసీమ జిల్లాల నుంచి భారీగా మిర్చి వాహనాలతో రైతులు వచ్చారు. దీంతో సోమవారం వేకువజామున హైదరాబాద్ రోడ్డులో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం వాటిల్లింది. అయితే యార్డు సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్లు చొరవ తీసుకొని వేగవంతంగా వాహనాలను యార్డు లోపలికి పంపించేయడంతో ఉదయం 7 గంటలకు ట్రేడింగ్ జరిగే సమయానికి క్లియర్ అయిపోయింది. ఈ విషయం తెలుసుకొన్న సెక్రటరీ చంద్రిక యార్డులో పర్యటించారు. కమీషన్ దుకాణాల వద్దకు వెళ్లి ట్రేడింగ్ జరుగుతున్న తీరుని పరిశీలించారు. మచ్చుకాయలు తీయొద్దని ఆదేశాలు జారీ చేశారు. కమీషన్ దుకాణాల ఎదుట పసుపు రంగు గీత దాటి ముందుకు టిక్కీలను అన్‌లోడింగ్ చేయొద్దన్నారు. అనంతరం రైతుల భోజనశాలని సందర్శించి అక్కడ మధ్యాహ్న భోజనం చేస్తున్న రైతులతో సంభాషించారు.



దుకాణాలను పరిశీలిస్తున్న సెక్రటరీ చంద్రిక

పరీక్షా పత్రం అందక విద్యార్థుల ఆందోళన

- కొద్ది నిమిషాల ముందు బీఈడీ మోడల్ పేపర్ పంపి జిరాక్స్ తీసుకోమన్న నిర్వాహకులు
- కొన్ని కేంద్రాల్లో మిషన్‌లు చెడిపోయి తీవ్ర జాప్యం
- ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 29 కేంద్రాల్లో నిర్వహణ
- యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా అవస్థలు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీఈడీ పరీక్షల నిర్వహణలో నాగార్జున యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు పరీక్షా కాలాన్ని పూర్తిగా వినియోగించుకోలేక ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం నుంచి బీఈడీ రెగ్యులర్, సప్లిమెంటరీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని మొత్తం 29 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 8500 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. అయితే రెండు, మూడు రోజులు ముందుగా సీల్డ్ బండిల్స్‌లో ఎంతో జాగ్రత్తగా పరీక్షా పేపర్లను ఆయా కేంద్రాలకు పంపుతారు. అందుకు భిన్నంగా సోమవారం పరీక్షా కేంద్రాలకు కేవలం 15 నిమిషాలు ముందుగా మోడల్‌గా ఒక పేపర్‌ను ఈ మెయిల్‌లో పంపి విద్యార్థులకు సరిపడా జిరాక్స్‌లు తీసుకోవాల్సిందిగా నాగార్జున యూనివర్సిటీ అధికారులు సూచించారు. ప్రింటింగ్ ఖర్చు తగ్గించుకునేందుకే యూనివర్సిటీ పరీక్షా కేంద్రం నిర్వాహకులు ఇలా పంపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రశ్నపత్రాన్ని సకాలంలో రూపొందించటంలో కూడా అధికారులు నిర్లక్ష్యం వహించటం మూలంగా కూడా అధికారులు ఇలా చేశారనే ఆగ్రహం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నది. దీని మూలంగా తమ కేంద్రానికి వచ్చిన పేపర్‌ను అప్పటికప్పుడు జిరాక్స్‌లు తీసి ఇవ్వటంలో ఆయా కేంద్ర నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని కేంద్రాల్లో జిరాక్స్ మిషన్‌లు మొరాయించటంతో జిరాక్స్ తీయించేందుకు బయట సెంటర్‌లకు పరుగులు తీయాల్సి వచ్చింది. దీంతో ఉదయం పది గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్షలు చాలా కేంద్రాల్లో ఆలస్యంగా జరిగినట్లు సమాచారం. అయితే కొన్ని కేంద్రాల్లో నిర్వాహకులు విద్యార్థులు కోల్పోయిన సమయాన్ని చివరలో ఇవ్వగా, కొన్ని కేంద్రాల్లో మాత్రం అనుమతివ్వకపోవటంతో విద్యార్థులు అరకొరగా పరీక్షలు రాయాల్సి వచ్చింది. కనీసం మంగళవారం నుంచి కొనసాగే పరీక్షలకైనా ప్రశ్నపత్రాన్ని ముందుగా పంపించి అటు పరీక్షా కేంద్రం నిర్వాహకులు, విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ సీఈవోగా డాక్టర్ కూరపాటి మేఘన



గుంటూరు (విద్య) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ సీఈవో (చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)గా డాక్టర్ కూరపాటి మేఘన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కూరపాటి మేఘన మాట్లాడుతూ యూనివర్సిటీ నియమ, నిబంధనలు, నైతిక విలువలు పాటిస్తూ వర్సిటీను మరింత ఉన్నత స్థానాలకు తీసుకువెళ్తానన్నారు.

టీడీపీ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు

బాపట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి చెందిన స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల నియోజకవర్గ శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాపట్ల పట్టణంలో శ్రీనివాస్‌నగర్‌లో 25 సంవత్సరాల క్రితమే మువ్వా సుబ్బారావు అనే వ్యక్తి 9.5 సెంట్ల స్థలాన్ని తెలుగుదేశం పార్టీ కార్యాలయం కొరకు నారా చంద్రబాబు నాయుడు పేరు మీద ఎప్పుడో రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అయితే నక్కా సత్తార్‌రెడ్డి అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్‌లతో ఆ స్థలాన్ని దొంగ రిజిస్ట్రేషన్ వేరే వ్యక్తికి చేశాడు. ఈ ఘటనపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.వైసీపీకి సంబంధించిన చాలా మంది ఇటువంటి భూదందా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. చాలామంది భూములను, ఇళ్లను దొంగ రిజిస్ట్రేషన్‌లు చేయటమేకాకుండా ప్రాపర్టీ ట్యాక్స్‌లను కూడా కట్టారని తెలిపారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చినా కూడా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. నకిలీ డాక్యుమెంట్‌లతో దొంగ రిజిస్ట్రేషన్‌లు జరిపి బ్యాంక్‌లలో రుణాలు తీసుకునే పనిగా పెట్టుకొని బ్యాంకర్లను మోసం చేస్తున్నారన్నారు. భూదందాలో నష్టపోయిన వారు ఎవరైన సరే వారికి తప్పకుండా న్యాయం చేస్తామనీ, ఎమ్మెల్యేగా తోడుంటానని నరేంద్రవర్మ తెలిపారు.

ఉప్పే అని ఊరుకున్నారు!

- మూడు నెలలైనా పోలీసులకు ఫిర్యాదు చేయని అధికారులు
- ఆర్గానిక్ ఎరువుల పేరిట రైతులను మోసగించే యత్నం
- స్టార్ అగ్రి జెనిటిక్స్‌కు కలిసొచ్చిన వ్యవసాయ శాఖ అలసత్వం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉప్పు భూమిని తాకితే అది నిస్సారమై చౌడునేలగా మారుతుంది. మొక్క మొలవదు, కాపు కాయదు. అంతటి ప్రమాదకరమైన పరిస్థితి. ఆర్గానిక్ ఎరువుల పేరుతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెనిటిక్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని రైతులను అటువంటి ప్రమాదంలో పడేసేందుకు ప్రయత్నం చేసింది. రైతుల నిరక్షరాస్యతను ఆధారంగా చేసుకుని ఆర్గానిక్ ఎరువుల పేరుతో ఉప్పును అంటకట్టింది. 2024 సెప్టెంబర్ 10న గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో ఉన్న వీఆర్ఎల్ పార్శిల్‌లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పంపేందుకు సిద్ధంగా ఉన్న ఆర్గానిక్ ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. అనుమానం వచ్చి సుమారు 13.68 లక్షల విలువ చేసే ఆరువేల కిలోల ఆర్గానిక్ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపటంతో అవి ఎరువులు కాదు.. ఉప్పని తేలింది. ల్యాబ్ నివేదికలో అన్ని నమూనాలు విఫలం కావడం అప్పట్లో సంచలనం సృష్టించింది. నవంబరులోనే ఈ రిపోర్ట్ ల్యాబ్ నుంచి అధికారులకు అందింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెనిటిక్స్‌పై కేసు నమోదు చేయిస్తామని అధికారులు అప్పట్లో వెల్లడించారు.

మూడు నెలలుగా....

ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెనిటిక్స్ యాజమాన్యం జైలుకు వెళ్తుందని అందరూ భావించారు. అయితే ఆ విషయంలో వ్యవసాయ శాఖ ఊహించని ట్విస్ట్ ఇచ్చింది. ల్యాబ్ రిపోర్ట్ వచ్చి మూడు నెలలు అయినా సంస్థపై క్రిమినల్ కేసు నమోదు కాలేదు. కనీసం ఉత్తరప్రదేశ్‌లోనైనా అక్కడి అధికారులను అప్రమత్తం చేశారా అంటే అదీ లేదు. ల్యాబ్ రిపోర్టు వచ్చిన తరువాత ఒకరిద్దరు స్థానిక ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకున్నారన్న ప్రచారం బలంగా ఉంది. దీంతో వ్యవసాయ శాఖ మౌనంగా ఉండిపోయింది.

ఆలస్యమే అమృతం...

వ్యవసాయ శాఖకు చెందిన వ్యవహారంలో ఎంత ఆలస్యం అయితే నకిలీ ఎరువులు, పురుగు మందులు అమ్మే వ్యాపారులకు అంత మేలు జరుగుతుంది. తొలుత వ్యవసాయ శాఖ అధికారులు సేకరించి ల్యాబ్‌కు పంపిన నమూనాలు విఫలం అయితే ఆ వ్యవహారంలో వ్యాపారులు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుంది. కోర్టుకు వెళ్లి నమూనాలు మళ్లీ సేకరించాలని ఆదేశాలు పొందే అవకాశం ఉంటుంది. ఇంతలో అధికారులు సీజ్ చేసి వేరే వ్యాపారి వద్ద ఉంచిన సరుకులో కూడా మార్పులు జరుగుతాయి. నకిలీ దాని స్థానంలో మంచి సరుకును ఏర్పాటు చేస్తారు. కోర్టు ఆదేశాలతో మళ్లీ నమూనాలు సేకరిస్తే మలి పరీక్షలో అది మంచిదనే రిపోర్టు వస్తుంది.

ఈ కేసులో కూడా...

ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెనిటిక్స్‌కు చెందిన ఉదంతంలో కూడా దరిదాపుగా అదే జరిగే అవకాశం కనిపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, నిర్లిప్తత నకిలీ వ్యాపారులకు కలిసి వస్తుందని అందరూ అంటున్నారు. పక్కాగా పట్టుకుని, ల్యాబ్ రిపోర్ట్ వ్యతిరేకంగా వచ్చిన తరువాత కూడా క్రిమినల్ కేసు నమోదుకు అధికారులు మీనమేషాలు లెక్కించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసలు పత్రాలు రావాలి..

ఈ కేసుకు సంబంధించిన అసలు పత్రాలు జేసీ కోర్టులో ఉన్నందున క్రిమినల్ చర్యలు చేపట్టలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అక్కడ నుంచి అసలు పత్రాలు తీసుకున్న తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ లోపు ఆర్గానిక్ ఎరువుల పేరిట రైతులను మోసపుచ్చాలని చూసిన ఉత్తరప్రదేశ్ సంస్థ అన్నీ సర్దుకుంటే ఏమిటి పరిస్థితి అన్న ప్రశ్నకు వ్యవసాయ శాఖ వద్ద సమాధానం లేదు.

ఆలపాటి విజయానికి కృషి చేయాలి

- మంత్రి గొట్టిపాటి రవి కుమార్



సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, పక్కన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా పనిచేసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలో నవయుగ ఫంక్షన్ హాల్‌లో పల్నాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి సమన్వయ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ అలసత్వం లేకుండా ప్రతి ఓటరును రెండు నుంచి మూడు సార్లు కలిసి ఓటుకు తీసుకురావాలన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా పెన్షన్ ఇస్తున్నారని అన్నారు. అదేవిధంగా అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేశారన్నారు. 7వ తేదీన ఆలపాటి రాజేంద్రప్రసాద్ నామినేషన్ వేస్తారని చెప్పారు. చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులను కలుపుకొని పనిచేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు పెరిగాయన్నారు. ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో మోడీ సహకారంతో అభివృద్ధి వైపు కూటమి ప్రభుత్వం ప్రయణిస్తుందన్నారు. అందరూ ఆశీసులు అందజేసి విజయానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి విజయానికి అందరూ కృషి చేయాలన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించటమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏలా అవమానించబడ్డారో తెలియజేయాలన్నారు. గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు చిలకలూరిపేట ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశి, రంగిశెట్టి రామకృష్ణ, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటిల రామచంద్రప్రసాద్, వెన్నా సాంబశివారెడ్డి, నరసరావుపేట పరిశీలకులు మన్నవ మోహనకృష్ణ, పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి అభిమతం

- స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమికి ఓటేసిన వైసీపీలోని నిజాయితీ గల కార్పొరేటర్లు
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ కార్పొరేటర్లను పార్టీలో చేర్చుకోవడం ఇష్టం లేకపోయినా, అందులోని నిజాయితీపరుల ప్రవర్తనతో తీసుకున్నాం. వైసీపీలో కొందరు మూడు వంతెనల నిర్మాణానికి అడ్డు పడుతుండగా, ఇంకొందరు మాత్రం నగరాభివృద్ధిని బలంగా కాంక్షిస్తున్నారు. అందులో భాగంగానే వైసీపీలోని పలువురు నిజాయితీపరులైన కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ చేస్తున్న అభివృద్ధికి ఓటు వేశారు' అని గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఢిల్లీలో ఎన్నికల ప్రచారం పూర్తి చేసుకున్న అనంతరం పెమ్మసాని గుంటూరులోని స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాలను స్థానిక అధికారులు, నాయకుల ద్వారా తెలుసుకున్నారు. స్టాండింగ్ కమిటీ ఫలితాల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందిన నేపథ్యంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీతోపాటు కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూడా టీడీపీకి అనుకూలంగా ఓటింగ్ చేశారన్నారు. నగరాభివృద్ధిని కోరుకుంటూ, అభివృద్ధిలో తామూ భాగమవ్వాలని భావించే వైసీపీలోని కొందరు నిజాయితీపరులే స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు మద్దతుగా నిలిచారని ఆయన తెలిపారు. చాలా కాలంగా వైసీపీ నుంచి పలువురు కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, అందుకు టీడీపీ సిద్ధంగా లేదని చెప్పారు. ఎవరైతే మంచి వ్యక్తులు, ప్రజోపయోగ కార్యక్రమాలలో ముందుండే నాయకులు ఆ పార్టీలో ఉన్నారో, అటువంటి నాయకులనే పార్టీలోకి తీసుకున్నామని చెప్పారు.

సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాలు

- ఏర్పాటుకు ఫైబర్ నెట్ సన్నాహాలు
- ఫలించనున్న సీసీఐ మాజీ మేనేజర్ ఆదిత్య పోరాటం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ అందుకు తగిన సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ జీవీ రెడ్డి ఆదేశాలతో సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించిన ఫైల్‌ను ప్రాసెస్ చేయమని ఆదేశించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి కార్యాలయం కూడా ధ్రువీకరించింది. సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మాజీ మేనేజర్ జి.సాయి ఆదిత్య పోరాటం చేస్తున్న విషయం విదితమే. గతేడాది మే నెలలోనే ఆయన ఈ విషయంలో రాష్ట్ర అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రి నారా లోకేశ్ కార్యాలయంలో సమర్పించిన వినతి పత్రం గుంటూరు జిల్లా కలెక్టర్‌కు పంపారు. దానిపై స్పందించిన కలెక్టర్ ఆల్ ఎలిమిటీస్‌తో కూడిన సీసీ కెమెరాలను సీసీఐ కేంద్రాల్లో ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. సీజన్ ఆరంభం అయిన తరువాత గుంటూరు జిల్లాలో నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు ఆరంభించారు కానీ ప్రభుత్వం తరపున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. ఆ విషయంలో సీసీఐ మాజీ మేనేజర్ సాయి ఆదిత్య హైకోర్టుకు వెళ్లగా గత డిసెంబర్ 16న సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోర్టు తీర్పు వెలువరించింది. ఒక వారం వ్యవధిలో తీర్పును అమలు చేయాలని ఆదేశించింది.

సీఎం కు ఫిర్యాదు...

సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో జరుగుతున్న జాప్యం, హైకోర్టు తీర్పు అంశాలను సాయి ఆదిత్య సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో సీసీఐ సబ్-మార్కెట్ యార్డులుగా నోటిఫై చేసిన 60 జిన్నింగ్ మిల్లుల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ అండ్ లైవ్‌స్టాక్ మార్కెట్స్ యాక్ట్ - 1966 అమలు కావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే ఫిర్యాదు ఫైబర్ నెట్ చైర్మన్‌కు కూడా అందజేశారు. ఫిర్యాదును పరిశీలించిన జీవీ రెడ్డి కోర్టు తీర్పును వెంటనే అమలు పరిచే విధంగా ఫైల్ ప్రాసెస్ చేయాలని కార్యాలయంలోని అధికారులను ఆదేశించారు.

ఆల్ ఎలిమిటీస్ అంటే...

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై గతేడాది అక్టోబరులోనే ఒక అంచనాకు వచ్చింది. ఒక్కొక్క కేంద్రంలో సుమారు 11 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేశారు. అందుకోసం అవసరమైన నిధులను మార్కెటింగ్ శాఖ భరించాల్సి ఉంది. ఆల్ ఎలిమిటీస్ కలిగిన సీసీ కెమెరాల ఏర్పాటు వలన సీసీఐ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక రాష్ట్ర ఆర్టీజీస్ సెంటర్‌లో తెలిసిపోతుంది. ఒక మనిషి ఆ కేంద్రానికి ఎన్నిసార్లు వచ్చారు. కేంద్రానికి ఎంత మొత్తంలో పత్తి వచ్చింది. ఎన్ని వందల దూది బేళ్లు వచ్చాయి. వంటి కీలకమైన విషయాలను ఆల్ ఎలిమిటీస్ కలిగిన సీసీ కెమెరాలు స్పాట్‌లో విశ్లేషిస్తాయి.విశ్లేషణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఈ కెమెరాలకు ఉంటుంది.

గుండెపోటుతో సీఆర్పీఎఫ్ జవాన్ మృతి



దావల చిన్నమూర్తియ్య(ఫైల్)

యడ్లపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ దావల చిన్నమూర్తియ్య(40) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. సీఆర్పీఎఫ్ 2006 బ్యాచ్‌కు చెందిన మూర్తియ్య ఒడిశాలో పనిచేస్తూ ఇటీవల స్వగ్రామమైన సొలసకు వచ్చాడు. సోమవారం ఉదయం కాలకృత్యాలు పూర్తయిన తరువాత గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మూర్తియ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మూర్తియ్య బంధువులు విషాదంలో మునిగిపోయారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వైసీపీకి ఏమీ చేతకాలేదు

- రాజ్యసభలో వైసీపీ ఎంపీపై పెమ్మసాని విసుర్లు



రాజ్య సభలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నిజంగా అంత అద్భుతమైన పాలనే చేసి ఉంటే 175కి 11 స్థానాలు మాత్రమే ఎందుకు వచ్చాయి? రాష్ట్రంలో ఒక్క రోడ్డు వేయలేకపోయారు. ఒక్క కేంద్ర ప్రభుత్వం పథకం కూడా ఉపయోగించుకోవడం చేతకాలేదు' అంటూ గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రాజ్యసభ సాక్షిగా వైసీపీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌పై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయం లాభసాటి కాదని, వ్యవసాయం, రైతులకు లబ్ధి చేకూరేలా వైసీపీ 11 స్కీములు పెట్టిందని, కానీ టీడీపీ పట్టించుకోవడం లేదని అని పిల్లి సుభాష్ చంద్రబోస్ రాజ్యసభలో మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలను మంత్రి పెమ్మసాని ఖండించారు. ఆంధ్రప్రదేశ్లో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తోందని, ఏడు నెలలకు ముందు వరకు రాష్ట్రంలో ఒక్క చిన్న రోడ్డు కూడా వైసీపీ ప్రభుత్వం వెయ్యలేకపోయిందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించిన ఏ ఒక్క పథకాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకోలేదని పెమ్మసాని స్పష్టం చేశారు. పెమ్మసానిని పిల్లి సుభాష్ చంద్రబోస్ అడ్డుకునే ప్రయత్నం చేయబోగా ఆయన్ను కూర్చోవాల్సిందిగా స్పీకర్ ఆదేశించారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ పద్మావతి



మున్నంగి హైస్కూల్ రికార్డులను తనిఖీ చేస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ పద్మావతి

కొల్లిపర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ బత్తుల పద్మావతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి గ్రామాల్లో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని పిల్లల తల్లిదండ్రులను, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ బాలల హక్కులు క్షేత్రస్థాయిలో పరిరక్షించాలనీ, ఉల్లంఘనలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. బాల్య వివాహాలు నిర్మూలించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం విషయంలో ప్రధానోపాధ్యాయులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా కమిషనర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్, నంద్యాల ఎడ్లజతకు ప్రథమ బహుమతి

రెంటచింతల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కానుకమాత 175వ తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో సోమవారం సీనియర్స్ విభాగంలో ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి, సాకేత్‌రెడ్డి, నంద్యాలకు చెందిన బొరెడ్డి కేశవరెడ్డికి కంబైన్డ్ ఎడ్లజత 2400 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి, మేకా కృష్ణమోహన్ (కృష్ణా జిల్లా) మక్కెన కోటేశ్వరరావు (ఉంగుటూరు, ప్రకాశం జిల్లా)లకు చెందిన కంబైన్డ్ ఎడ్లజత 2165.3 అడుగుల దూరం లాగి రెండో బహుమతి, పులగం త్రిషగ్నారెడ్డి (కుంచనపల్లి, తాడేపల్లి)కి చెందిన ఎడ్లజత 2140 అడుగుల దూరం లాగి మూడో బహుమతి, అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరిల (వేటపాలెం, బాపట్ల జిల్లా)కు చెందిన ఎడ్లు 2100 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతి, కటకంట లక్ష్మణకుమార్ (దుర్గి, పల్నాడు జిల్లా) ఎడ్ల జత 1847 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని కైవసం చేసుకున్నాయి. 9 జతలకు వరుసగా బహుమతులివ్వగా, మరో మూడు జతలకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. 6 రోజుల పాటు నిర్వహించిన పోటీలకు రెండు రాష్ట్రాల నుంచి 70 జతలు పోటీల్లో పాల్గొన్నాయి. సుమారు రూ.16 లక్షలు విలువ చేసే బహుమతులు అందజేశారు. కానుకమాత కోడె గిత్తల కమిటీకి చెందిన వైఎల్ మర్రెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, ఆదూరి ఇన్నారెడ్డి, ఓరుగంటి ఇన్నారెడ్డి, శౌర్రెడ్డి, రాయపరెడ్డి, జోసఫ్ రెడ్డి, రాజారెడ్డి, ఏరువ జోజిరెడ్డి, వెన్నా కోటిరెడ్డి, సునీల్‌రెడ్డి తదితరులున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

పెదనందిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై అత్యాచారం ఆపై హత్య కేసులో నిందితులను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు సమాచారం. గతంలో పలు అత్యాచార కేసుల్లో ఉన్న నిందితుడు పాలపర్తి మంజు, అతని సోదరులను విచారణ చేస్తున్నారు. హత్య జరిగిన సమీపంలోనే నిందితులు ఉండడం, వీరిపై అనుమానాలు ఉండటంతో, విచారణ చేసేందుకు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 550.20 అడుగులు ఉంది. ఇది 210.21 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9330 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 19,163 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,05,330 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,20,593 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,05,330 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 74,044 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	9000	10500
నెంబరు. 5	10500	13000	నెంబరు.5	--	--
273	--	--	273	--	--
341	8500	14500	341	10000	11000
4884	12000	12500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7000	14500	తేజ	8500	13000
బ్యాడిగి	7000	13200	బ్యాడిగి	9000	10500
దేవనూరు డీలక్స్	7500	13000	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4500	10000

8 నుంచి నాటకోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కేఆర్‌కే ఈవెంట్స్ నిర్వహణలో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి ఆధ్వర్యంలో 13వ నాటకోత్సవాలు ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 8న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు డాక్టర్ కాసరనేని సదాశివరావు ఆత్మీయ పురస్కారంతో సత్కారం, డాక్టర్ యర్రా నాగేశ్వరరావుతో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ, శ్రీ సాయి కార్తీక్ క్రియేషన్స్, కాకినాడ వారిచే 'దేవుడు కనిపించాడు' నాటిక ప్రదర్శన, 9న ఎల్వీఆర్ క్రియేషన్స్ గుంటూరు వారిచే హాస్య వల్లరి, హేలాపురి కల్చరల్ అసోసియేషన్, ఏలూరు వారిచే 'సారీ... రాంగ్ నెంబర్' నాటిక ప్రదర్శన, శ్రీకరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ గుంటూరు వారిచే 'తరమెల్లి పోతున్నదో' నాటిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ప్రజల ఆకాంక్షల మేరకే కూటమి అభ్యర్థుల విజయం

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యాలయంలో సంబరాలు
- స్టాండింగ్ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యేలతో ఘన సత్కారం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు మాధవి, నసీర్, రామాంజనేయులు, జనసేన నాయకులు బోనబోయిన, గాదె, కార్పొరేటర్లు, తదితరులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర ప్రజల ఆకాంక్షల మేరకే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించా రని ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న ఎన్నికల సరళిని సోమవారం ఎమ్మెల్యేలు పరిశీలించి, కార్పొరేటర్లకు పలు సూచనలు చేశారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలో గెలుపొందిన ఆరుగురు సభ్యులకు ఘన సత్కారం చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. నగరపాలక సంస్థలో జరుగుతున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపర్చిన అభ్యర్థులు ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, ముప్పవరపు భారతి, షేక్ మీరావలి, దాసరి లక్ష్మీదుర్గ గెలుపొందారని వారందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. గడిచిన 5 ఏళ్ల కాలంలో నగర అభివృద్ధికి వైసీపీ తిలోదకాలు ఇచ్చిందని, గుంటూరును గుంటలూరుగా మార్చి వేశారని అన్నారు. కానీ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరం లోపే వీటన్నింటికీ పరిష్కారం చూపిందని, ఇవన్ని చూసి వైసీపీ కార్పొరేటర్లు తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి, ఎన్డీయే కూటమి పార్టీలలో చేరారని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యాలయంలో గెలుపొందిన స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎమ్మెల్యేలు మాధవి, నసీర్, రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్‌లు ఘనంగా సత్కరించి, వారిని అభినం దించారు. ఈ కార్యక్రమంలో కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, మానం పద్మశ్రీ, సాధు రాజేష్, అడక పద్మావతి, సంకూరి శ్రీనివాస్, అందుగుల సంతోష్, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండేళ్లలో రైల్వేగేట్లన్నీ తొలగింపు

- పాండురంగ విఠల్

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఉన్నటువంటి అన్ని రైల్వే గేట్లకు ప్రత్యామ్నాయంగా ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలను వచ్చే రెండేళ్లలో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ పాండురంగ విఠల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం గుంటూరు రైల్వే డివిజన్‌తో పాటు ఇతర డివిజన్లలో భారీ సంఖ్యలో ఉన్న రైల్వే గేట్లపై సర్వే నిర్వహిస్తున్నదన్నారు. రాష్ట్రంలో మొత్తం 390 రైల్వే గేట్లు ఉన్నట్లు తేల్చారు. వీటి ఆధారంగా నిధులు కేటాయించి రైల్వే గేట్ల స్థానంలో వంతెనలు నిర్మించనున్నదని పేర్కొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్ అండ్ జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ప్రసిద్ధి చెందిన కంపెనీ యనలాగ్ పోర్ట్ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలలోని ముగ్గురు ఈసీఈ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగ దీష్ కె.మద్దినేని తదితరులు అభినందించారు. కళాశాలలో ఈసీఈ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న జీ.మేఘన, బీ.శ్రీనాథ్, ఎం.శ్రీలక్ష్మి ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు.

వైభవంగా శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, శ్రీసిద్దేశ్వరీ పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో శ్రీరామ సప్తహ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామికి గణపతి పూజ, విశేషాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గంగా, భువనేశ్వరి సమేత ఓంకారేశ్వరి స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం మంచికంటి వెంకటసత్యవతి శ్రీమద్రామాయణంపై ప్రవచనం చేశారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కేసు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శారద కాలనీకి చెందిన కళ్యాణ్, శ్రీనాథ్ అనే ఇద్దరు యువకులు శారద కాలనీ ఆర్చీ సెంటర్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించారు. ఆ సమయంలో అడ్డుకున్న ఆ బాలిక చిన్నమ్మతో గొడవ పెట్టుకొని దుర్భాషలాడారు. ఈ ఘటనపై బాలిక తల్లి అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయమంటే బెదిరిస్తున్నాడు..

గుంటూరు ఫిబ్రవరి 3 ఆంధ్రజ్యోతి : ప్లాట్ విక్రయించి డబ్బు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా అడిగిన వారిని బెదిరించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిబాబా రోడ్డుకి చెందిన కాటూరు శ్రీనివాసరావు కుమారుడు సుమంత్, వేటుకూరి శ్రీనివాసరాజు అనే వ్యక్తి వద్ద రూ. 85 లక్షలకు ఓ ప్లాట్ కొనుగోలు చేశారు. ఇందుకుగాను రూ.30 లక్షల చెల్లించి విక్రయ భయాన అగ్రిమెంట్ రాసుకున్నారు. మిగిలిన మొత్తం చెల్లించిన సమయంలో రిజిస్ట్రేషన్ చేసే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ఆ ప్రకారం మిగతా డబ్బు చెల్లిస్తానంటే రిజిస్ట్రేషన్ చేయకుండా సుమంత్ బెదిరిస్తున్నాడని శ్రీనివాసరావు పోలీసులను ఆశ్రయించాడు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జ్ఞాన సరస్వతి అమ్మవారి పూజలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

భక్తిశ్రద్ధలతో సామూహిక అక్షరాభ్యాసం

- భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ

గుంటూరు (కార్పొరేషన్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అత్యంత భక్తిశ్రద్ధలతో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారని భాష్యం సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ తెలిపారు. సోమవారం వసంతపంచమి సందర్భంగా దక్షిణ బాసరగా వెలుగొందుతున్న గోరంట్లలోని శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తమ చిన్నారుల భవిష్యత్తుకు బంగారుబాట వేయాలనే సంకల్పంతో అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారి ఆశీస్సులు పొందారని అన్నారు. అనంతరం ఆయన చిన్నారులను ఆశీర్వదించారు. ఆలయ ప్రెసిడెంట్ ఓరుగంటి విశ్వనాథం మాట్లాడుతూ చదువుల నిలయమైన గుంటూరులో శ్రీషిరిడిసాయి ఆధ్యాత్మిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు, ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ ఓవీ రమణ సంకల్పంతో ఈ ఆలయ నిర్మాణానికి విశ్రాంత డీజీపీ ద్వారకా తిరుమలరావు శంకుస్థాపన చేశారని అన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎందరో చిన్నారులకు ఈ ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమాలు దిగ్విజయంగా జరుతున్నాయని తెలియజేశారు.

శ్రీసరస్వతీ కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో..

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీతారాంనగర్‌లోని శ్రీసరస్వతీ కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం అక్షరాభ్యాసన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజ నిర్వహించి చిన్నారులకు ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి డీవీ సుబ్బారావు, పాఠశాల కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

డిగ్రీ ఫలితాల్లో చలమయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కర్పూరపు రామకృష్ణ ప్రభు, పచ్చిపులుసు రాఘవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం కంప్యూటర్స్ లో 98 శాతం, బీఎస్సీ కంప్యూటర్స్‌లో 90 శాతం, బీసీఏలో 95 శాతం విద్యార్థులు మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, సభ్యులు కర్పూరపు సూర్యనారాయణ, అధ్యాపకులు భవాని దుర్గ, చంద్రశేఖర్, రాజరాజేశ్వరి, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, మధుసూదన్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యక్షుడు రామకృష్ణ ప్రభు తదితరులు

పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రజలకు తెలియపరచడంలో పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం కీలక పాత్ర పోషిస్తుందని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం చుట్టుగుంట సెంటర్ ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్టు వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఎస్పీ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ద్వారా ట్రాఫిక్ పోలీసు వారికి ట్రాఫిక్ నియంత్రణ సులభతరం కానుందన్నారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ హెచ్చరికలు జారీ చేయడం, ట్రాఫిక్ సిగ్నల్ సమాచారం, అత్యవసర ట్రాఫిక్ డైవర్షన్లు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్, ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్లు మూసివేసిన సమాచారం, ట్రాఫిక్ నియమాల గురించి ప్రజలకు తెలియ జేయవచ్చన్నారు. పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ద్వారా ట్రాఫిక్ వ్యవస్థలో మెరుగైన మార్పులు చోటుచేసుకుంటాయని ఆశిస్తున్నాట్లు తెలిపారు.

ట్రాఫిక్ సిబ్బందికి రేడియం జాకెట్‌లు అందజేత

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవం (ఫిబ్రవరి 4) పురస్కరించుకుని ప్రజలకు క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన పెంపొందించడంలో భాగంగా తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్ వారు సోమవారం ఎస్పీ చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీస్ వారికి సుమారు 200 రేడియం జాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ రేడియం జాకెట్లు రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే పోలీసులకు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. వీటిని అందించిన మణిపాల్ హాస్పిటల్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న వేసవికాలంలో పోలీసుల విధి నిర్వహణకు అవసరమైన టోపీలు, కళ్ళజోళ్ళు గ్లూకోజ్, తాగునీటి సదుపాయాలు మొదలగు వాటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ట్రాఫిక్ సీఐలు అశోక్ కుమార్, సింగయ్య, ఎస్సైలు శ్రీహరి, సాంబశివరావు నాయక్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూరాలజీ వార్డుకు ఆరు వీల్‌చైర్ల విరాళం

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ విభాగానికి సోమవారం ఇద్దరు దాతలు ఆరు వీల్‌చైర్లను విరాళంగా అందజే శారు. గతంలో తన తల్లి గులియన్ బ్యారీ సిండ్రోమ్ బారినపడగా, న్యూరాలజీ వైద్యుల చికిత్సలతో ఆమె పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యారని, దీనికి కృతజ్ఞతగా న్యూరాలజీ వార్డుకు మూడు వీల్‌చైర్లను సోమవారం విరాళంగా అందజేసినట్లు జే విజయకృష్ణ అనే దాత తెలిపారు. బెవిలిన్ ఫార్మా కంపెనీ రీజనల్ మేనేజర్ టీ రాఘవేంద్రరావు, ఏరియా మేనేజర్ ఏ శ్రీనివాసరెడ్డి, మూడు వీల్‌చైర్లను ఈ వార్డుకు సోమవారం విరాళంగా అంద జేశారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్వీ రమణ, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణకుమారి తదితరులు దాతలను అభినందించారు. కాగా గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింకానా) స్థానిక కోఆర్డినేటర్లు డాక్టర్ వీ బాలభాస్కరరావు, డాక్టర్ పీవీ హనుమంతరావు, ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చెత్త సేకరణకు 100 డస్ట్‌బిన్లను విరాళంగా అందజేశారు.



వీల్‌చైర్లతో సుందరాచారీ, రమణ, అరుణ తదితరులు

స్టాండింగ్ కమిటీ నగరాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

- జనసేన కార్పొరేటర్‌ను సన్మానించిన నేతలు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులు నగరాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి కోరారు. స్టాండింగ్ కమిటీ సభ్యురాలుగా జనసేన పార్టీ నుంచి గెలుపొందిన 16వ డివిజన్ కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గను సోమవారం జనసేన పార్టీ కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, ఆ పార్టీ నాయకులు ఆళ్ల హరి, మెహబూబ్ బాషా, బందెల నవీన్, జడ సురేష్ తదితరులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ నగరపాలక సంస్థకు పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు అయినా నగరంలో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదన్నారు. వైసీపీ నాయకులు సంపాదనపై తప్ప నగరాభివృద్ధిపై ఏనాడు దృష్టి పెట్టలేదన్నారు.

గుంటూరు మార్కెట్లోకి కియా సిరాస్ ఎస్‌యూవీ విడుదల



కియా సిరాస్ ఎస్‌యూవీ కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న డీటీసీ సీతారామిరెడ్డి, ఎస్‌బీఐ డీజీఎం కృష్ణకుమార్ బి.ప్రభు, సింహా మోటార్స్ సేల్స్ హెడ్ మారుతి కుమార్

విజయవాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులోని సింహా మోటార్ సంస్థలో సోమవారం మార్కెట్లోకి కియా సిరాస్ ఎస్‌యూవీని విడుదల చేశారు. కారు విడుదల కార్యక్రమంలో గుంటూరు డీటీసీ కె.సీతారామిరెడ్డి, ఎస్‌బీఐ డీజీఎం కృష్ణకుమార్ బి.ప్రభు, సింహా మోటార్స్ సేల్స్ హెడ్ ఎస్.ఎల్.మారుతి కుమార్, సేల్స్ ఏజీఎం జి.క్రాంతికుమార్‌లు పాల్గొన్నారు. 2019లో సింహా మోటార్ షోరూమ్ ప్రారంభించిన దగ్గర్నుంచి నాలుగు బ్రాంచీల ద్వారా ఇప్పటి వరకు 9721 కార్లను విక్రయించినట్లు మారుతి కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ నూతన సిరోస్ కారులో 12.3 అంగుళాల టచ్ స్క్రీన్, 12.3 అంగుళాల క్లస్టర్, 5 అంగుళాల ఏసీ కంట్రోల్స్ అన్ని కలిసి ఒకే 30 అంగుళాల ట్రినిటీ పానరోమిక్ డిస్‌ప్లే కలిగిఉంటుందన్నారు. వీటితోపాటు వెనుకసీట్లు కూడా వెంటిలేషన్, రీక్లైనింగ్, స్లైడింగ్ సౌకర్యాలు కలిగి ఉంటాయన్నారు. 20 స్టాండర్డ్ భద్రతా ప్రమాణాలను కలిగి ఉంటాయన్నారు. పెట్రోల్, డీజిల్, ఆటోమ్యాటిక్, మాన్యువల్ వేరియంట్స్‌లలో 8 ఆకర్షణీయమైన రంగులలో లభిస్తాయన్నారు. దీని ప్రారంభ ధర రూ.8,99,900(ఎక్స్ షోరూం ధర)గా ఉందన్నారు. కార్ల బుకింగ్ కొరకు సింహా మోటార్స్ షోరూంలో సంప్రదించవచ్చునని తెలిపారు.

బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్ అందజేత

- నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ గ్యారేజ్ సెక్యూరిటీ గార్డు

గుంటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి విజయవాడకు వెళుతూ ఓ ప్రయాణికుడు ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్, సర్టిఫికెట్లను అందించి ఆర్టీసీ గ్యారేజ్ సెక్యూరిటీ గార్డు తన నిజాయితీ చాటుకున్నాడు. గుంటూరు నుంచి ఎం మంజునాథ్ అనే ప్రయాణికుడు విజయవాడకు వెళుతూ ఆదివారం బస్సులో ల్యాప్‌టాప్, ఒర్జినల్ సర్టిఫికెట్లు మరిచిపోయాడు. బస్సు చివరగా గుంటూరు-2 డిపో గ్యారేజ్‌లోకి వెళుతుండగా బస్సులో చెకింగ్ సమయంలో గ్యారేజ్ సెక్యూరిటీ గార్డు సీహెచ్ సాంబశివరావు ల్యాప్‌టాప్‌ను, సర్టిఫికెట్లను పరిశీలించి మేనేజర్ అబ్దుల్ సలామ్ దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన డిపో మేనేజర్ సదరు ప్రయాణికుడికి ఫోన్ చేసి బస్టాండ్‌కు పిలిపించి అందజేశారు. గార్డు సాంబశివరావును డీఎం అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జి.సాంబశివ, అసిస్టెంట్ ఇంజనీర్ సీహెచ్ చైతన్య ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపై టీడీపీ చొరవ అభినందనీయం : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను చర్చించడాన్ని స్వాగతిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక గుంటూరు కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి టీవీ చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ళ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల నాటికి తగిన కార్యాచరణను ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు, సీఐడీ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అగ్రిగోల్డ్ ఆస్తులను పరిరక్షించాలన్నారు. ఈ అంశాలపై చర్చించేందుకు త్వరలోనే ముఖ్యమంత్రిని కలవనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో పల్నాడు జిల్లా, అమరావతిలో అసోసియేషన్ రాష్ట్ర విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి, షేక్ బషీర్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు 'ఆల్బెండజోల్'

- ఫిబ్రవరి 10న ఆరోగ్య సిబ్బందితో పంపిణీ
- కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరి 10న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో లబ్ధిదారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం డీవార్మింగ్ డేపై కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. నులి పురుగుల నివారణకు ఏడాది వయస్సు దాటిన పసిబిడ్డల నుంచి 19 ఏళ్లలోపు యువతీ, యువకులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తారని కలెక్టర్ నాగలక్ష్మి వివరించారు. పసి బిడ్డలకు ఈ మాత్రలను నీటిలో కరిగించి తాగించాలని ఆమె సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అనంతరం గంట తర్వాత ఈ మాత్రను పిల్లలతో మింగించాలని ఆమె తెలిపారు. పదో తేదీన ఆల్బెండజోల్ మాత్రలు పొందలేని వారి కోసం ఫిబ్రవరి 17న మాపప్ కార్యక్రమం నిర్వహించి వారికి ఈ మాత్రలు అందజేస్తారని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని కలెక్టర్ కోరారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై రూపొందించిన ప్రచార చిత్రాలను ఆమె విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ మజీదా బేగం, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డీటీసీవో డాక్టర్ దాసరి శ్రీనివాసులు, ఐసీడీఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయలక్ష్మీ, డీఈవో రేణుక పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

వీధి కుక్కల నియంత్రణకు వ్యాక్సినేషన్ చేపట్టాలి

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోడేటి సందీప్
- జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీలో పిటీషన్ వేసినట్లు వెల్లడి

గుంటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నియంత్రణకు పకడ్బం దీ చర్యలు తీసుకోవాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది తోడేటి సందీప్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 16 జూలై 2024 న సమాచార హక్కు చట్టం ద్వారా గుంటూరు మున్సి పల్ కార్పొరేషన్ వారికి వారి పరిధిలో ఎన్ని వీధి కుక్కలు ఉన్నాయి, వాటిలో ఎన్నింటికి వ్యాక్సినేషన్స్ చేశారనే సమాచారం అడగ్గా దానికి వారు ఆగస్టు మాసంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు జవాబిస్తూ 33వేల వీధి కుక్క లు ఉన్నాయని వాటికి 1335 వాటికి జనన నియంత్రణ ఆపరేషన్లు, వ్యాక్సినేష న్ ఇచ్చామని సమాచారం ఇచ్చినట్లు సమాచారం తెలియజేశారు. దీనిపై డిసెంబరులో 2024లో గుంటూరు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీలో ఒక పిటిషన్ ఫైల్ చేయగా దీనికి బదులుగా వారు సమాధానం ఇస్తూ డిసెంబర్ 30వ తేదీ నాటికి 4312 వీధి కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లు, వ్యాక్సి నేషన్లు ఇచ్చినట్లు చెప్పారన్నారు. వీటిని పర్యవేక్షించడానికి ఒక పశు వైద్యాధి కారిని నియమించినట్ల చెప్పారన్నారు. అయితే ఒక నెలలో 165 వీధి కుక్కల కు మాత్రమే వాక్సినేషన్ ఇచ్చారని, 33వేల వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ ఇవ్వా లంటే ఎన్నేళ్ళు పడుతుందో అధికారులే చెప్పాలన్నారు. వీధి కుక్కలు పసి పిల్లలు, వృద్ధులు ఇలా భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు.

విద్యార్థులు దేశ రక్షణలో భాగస్వాములు కావాలి

- కల్నల్ పునీత్‌కుమార్ పిలుపు


గుంటూరు (కార్పొరేషన్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశరక్షణలో భాగస్వా ములు కావాలని ఇండియన్ ఆర్మీ కల్నల్ పునీత్‌కుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో నిర్వహించిన 'విద్యార్థి భవిష్యత్తు ప్రణాళిక అవగాహన' కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ఎన్నో ముఖ్య విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా పునీత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకోవడానికి ఇది సరైన సమయమని అన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణ, దేశభక్తి, సమయపాలన, పట్టుదల వంటివి విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని, మిగిలిన రంగాల్లో ఉన్నట్లుగానే ఇండియన్ ఆర్మీలో కూడా ఎన్నో అత్యుత్తమ పదవుల్లో అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కల్నల్ పునీత్‌కుమార్‌ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఎన్‌సీసీ కేర్ టేకర్ వాసిరెడ్డి శివ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



కల్నల్ పునీత్‌కుమార్‌ను సత్కరిస్తున్న సీతారామయ్య హైస్కూల్ సెక్రటరీ విష్ణువర్ధన్ తదితరులు

'ప్రేమ శిఖరం' పద్య కావ్య పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై ఢమరుకం లలిత కళాసమితి ఆధ్వర్యంలో సాహిత్య బ్రహ్మ వీవీఎల్ నరసింహారావు ఆనంద భిక్షువు పద్య కావ్యం ప్రముఖ రచయిత చిటిప్రోలు వెంకటరత్నం నాటకీకరణ గావించిన 'ప్రేమ శిఖరం' పద్య కావ్యం ఆవిష్కరణ సభ ఘనం గా జరిగింది. లఘు చిత్రదర్శకుడు గన్నే వాసుదేవరావు సభకు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు, డాక్టర్ భవానీ దేవి గ్రంథావిష్కరణ చేసి వెంకటరత్నం జయప్రద దంపతులకు అందజేశారు. పుస్తకాన్ని వీ నాగరాజ్యలక్ష్మి సమీక్ష చేశారు. కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, ఊటుకూరి నాగేశ్వరరావు మైలవరపు లలితకుమారి, వీఎస్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



'ప్రేమ శిఖరం' పద్య కావ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు, ఆలయ కమిటీ సభ్యులు

వైభవంగా శ్రీవారి బ్రహోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల, అన్నపూర్ణ నగర్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేద పండితులు ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చన, విష్వక్సేన పూజ, నిత్యహోమం నిర్వహించారు. పూజల్లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దంపతులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంగళవారం స్వామికి పవళింపు సేవ జరుగుతుందని, దీంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. కూటమి నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలికలు.. భళా

పేదరికం.. ఆపై అమ్మాయిలు.. అయినా మట్టిలో మాణిక్యాల్లా మెరిశారు. బాలికలైనా భళా అని పిలిపించుకున్నారు. మారుమూల పల్లె అయినా.. సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదని శావల్యాపురం జడ్పీ పాఠశాల బాలికలు నిరూపించారు. బడిలో చేరినప్పటి నుంచే ఆటలపై ఉన్న మక్కువతో బాల్ బ్యాడ్మింటన్ క్రీడను ఎంచుకుని మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో అంచెలంచెలుగా రాణించి చివరికి జాతీయస్థాయి పోటీలో కూడా తమసత్తా చాటారు. ప్రతిభకు పేదరికం ఏ మాత్రం అడ్డు కాదని లక్ష్యాలను ఎంచుకుని పట్టుదలతో సాధన చేస్తే సాధించలేనిది ఏదీ ఉండదని నిరూపించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో జాతీయస్థాయిలో రాణించి తల్లిదండ్రులకు, పుట్టి పెరిగిన గ్రామంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన శావల్యాపురం జడ్పీపాఠశాలకు పేరుప్రఖ్యాతులను సాధించిపెట్టారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలకు ప్రతిష్ఠాత్మకమైన క్రీడాప్రతిభా అవార్డును సొంతం చేశారు.

- బాల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థినుల హవా
- మారుమూల పల్లె నుంచి జాతీయ స్థాయికి
- అంచెలంచెలుగా ఎదిగిన శావల్యాపురం జడ్పీ బాలికలు

శావల్యాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చదువే లోకంగా మారిన ప్రస్తుత సమాజంలో అందరిలా కాదు.. తాము భిన్నమని నిరూపించారు ఆ బాలికలు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్నో జడ్పీ పాఠశాలలు ఉన్నాయి.. వాటిలో ఎందరో విద్యను కొనసాగిస్తున్నారు. కానీ వినుకొండ నియోజకవర్గ పరిధిలోని శావల్యాపురం జడ్పీ పాఠశాలలో బాలికలు మాత్రం ప్రత్యేకంగా నిలిచారు. ఆటల్లో తమకున్న ఆసక్తికి మెరుగులద్ది జాతీయ స్థాయిలో రాణించి భళా అనిపించుకున్నారు. స్పోర్ట్స్ కోటాలో సీట్లు సాధించి పాఠశాలకు జాతీయస్థాయిలో పేరుతెచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షుడు శివశంకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ప్రోత్సాహం, జిల్లా జాయింట్ సెక్రటరి, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి ప్రేరణలో బాలికలు బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచారు. పాఠశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న ఆకుమల్ల సమీర(శానంపూడి), కామినీడి కావ్య(శావల్యాపురం), జూనియర్ ఇంటర్ చదువుతున్న వేముల దివ్య(శావల్యాపురం), ముట్లూరి లూధియా, బండారు దేవమణి(బొందిలిపాలెం) ఇటీవల జాతీయస్థాయి పోటీలకు ఎంపికై రాణించారు. కనమర్లపూడి గ్రామానికి చెందిన ముక్కపాటి లిఖిత, ఉప్పు బసవరాణి జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. స్పోర్ట్స్‌కోటాలో ముక్కపాటి లిఖిత చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తుంది. ఉప్పు బసవరాణి నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో చదువుకుంటుంది. బొందిలిపాలెం గ్రామానికి చెందిన రావినూతల రత్నకీర్తన, 9వతరగతి చదువుతున్న కనమర్లపూడి గ్రామానికి చెందిన చల్లా శ్రీహర్షిత, ఉప్పు లలిత, బండారు రవళిలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రాణించారు. యోగా, వాలీబాల్, రోప్ స్కిప్పింగ్, త్రోబాల్ తదితర క్రీడల్లో పలువురు విద్యార్థులు స్కూల్‌గేమ్స్, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రాణించారు. 2019లో జిల్లాస్థాయి జోనల్ పోటీల్లో శావల్యాపురం జడ్పీ పాఠశాల జట్టు చాంపియన్స్‌గా నిలిచింది. 2023లో జిల్లాస్థాయి ఆడుదాం-ఆంధ్ర పోటీల్లో మహిళల క్రికెట్ జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. 2024-25 విద్యాసంవత్సరంలో శావల్యాపురం జడ్పీపాఠశాల క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైంది.


బాలికలను అభినందిస్తున్న హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు (ఫైల్)

చిన్నప్పటి నుంచే.. బసవరాణి

ఉప్పు బసవరాణి చిన్నతనం నుంచే క్రీడలపై మక్కువతో రాణిస్తోంది. అంచెలంచెలుగా రాణిస్తూ జూనియర్ బాలికల విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో రెండోర్యాంక్ సాధించింది. 16కిపైగా రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు సాధించింది.



దేవమణికి రెండో ర్యాంకు

జూనియర్ ఇంటర్ చదువుతున్న బొందిలిపాలేనికి చెందిన బండారు దేవమణి బాల్‌బ్యాడ్మింటన్‌లో సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో రెండోర్యాంక్ సాధించింది. 10కిపైగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది.



జాతీయ స్థాయిలో లిఖిత.. బంగారం

ముక్కపాటి లిఖిత బాల్‌బ్యాడ్మింటన్‌లో నాలుగు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించింది. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించింది.



జాతీయస్థాయిలో రాణించడం శుభపరిణామం



జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బాలికలు ఎంపికై రాణించడం శుభపరిణామం. ఆరో తరగతి నుంచే బాలికల్లో ప్రతిభను గుర్తించి పీడీ రాధాకృష్ణమూర్తి ప్రేరణ ఇచ్చి వారిని ఉన్నతస్థాయికి చేర్చేలా కృషి చేస్తున్నారు. బాలికలు క్రీడల్లో రాణించేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించాం. మిగిలిన విద్యార్థులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలి.

\- బొడ్డపాటి విజయలక్ష్మి, హెచ్ఎం

ఉన్నతస్థాయికి ఎదగాలి



బాలికలు పురుషులకు దీటుగా ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. స్పోర్ట్స్‌కోటాలో చదువుల్లో 2 శాతం, ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ ఉన్నందున బాలికలు క్రీడల్లో ప్రణాళికాబద్ధంగా రాణించాలి. చిన్నతనం నుంచే లక్ష్యాలను కేటాయించుకొని వాటిని సాధించేందుకు కృషి, పట్టుదలతో సాధన చేయాలి. పదేళ్లుగా ఎంతోమంది విద్యార్థులను క్రీడల్లో ఉన్నతస్థాయికి చేర్చడం ఆనందంగా ఉంది. క్రీడాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు అందిస్తున్న సహకారాన్ని బాలికలు సద్వినియోగం చేసుకుని రాణించడం శుభపరిణామం.

\- రాగుల రాధాకృష్ణమూర్తి, పీడీ

నేషనల్ మెడల్స్ సాధించిన సమీర

సీనియర్ ఇంటర్ చదువుతున్న శానంపూడి గ్రామానికి చెందిన ఆకుమల్ల సమీర బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలో సీనియర్ నేషనల్ మెడల్ ఆల్ ఇండియా రెండో ర్యాంక్ సాధించింది. సబ్ జూనియర్స్ నేషనల్ మెడల్‌తో పాటు స్కూల్‌గేమ్స్ నేషనల్ మెడల్, పెడరేషన్ కప్ నేషనల్ మెడల్ సాధించింది. 20కిపైగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించింది.



కావ్య.. ఆల్‌ఇండియాలో ద్వితీయ స్థానం

సీనియర్ ఇంటర్ విద్యార్థిని అయిన శావల్యాపురానికి చెందిన కామినీడి కావ్య బాల్ బ్యాడ్మింటన్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్-19 జూనియర్ బాలికల విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. 15కిపైగా రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు సాధించింది.



దివ్య.. సబ్‌జూనియర్స్‌లో రెండో ర్యాంకు

జూనియర్ ఇంటర్ చదువుతున్న శావల్యాపురానికి చెందిన వేముల దివ్య బాల్‌బ్యాడ్మింటన్‌లో సబ్‌జూనియర్స్ విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. స్కూల్ గేమ్స్‌లో నేషనల్స్‌కు ఎంపికైంది. 15కిపైగా రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు సాధించింది.



లూథియాకు పతకాలే పతకాలు..

జూనియర్ ఇంటర్ చదువుతున్న శావల్యాపురానికి చెందిన ముట్లూరి లూథియా ఆరేళ్లలో పాఠశాలస్థాయి నుంచి జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. సబ్ జూనియర్స్ విభాగంలో ఆల్‌ఇండియాలో రెండో స్థానం సాధించింది. 15కు పైగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని వివిధ పతకాలు సాధించింది.



మంగళగిరికి మంచి రోజులొచ్చాయి. దేశమంతా మంగళగిరి వైపు తిరిగి చూసేలా తన పనితీరు ఉండబోతుందని పదేపదే చెప్పుకొచ్చిన మంత్రి నారా లోకేశ్.. ఆ దిశగా తన ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను చాలా వేగంగా ప్రారంభించారు. దేశంలో అతిపెద్ద గోల్డ్‌హబ్‌ను మంగళగిరిలో ఏర్పాటు చేయించేందుకు కృషి సాగిస్తూనే.. రూ.294 కోట్ల వ్యయంతో తాడేపల్లి సీతానగరం వద్ద మహానాడు వరద ముంపు బాధితుల ప్రయోజనార్థం కృష్ణానదికి రిటైనింగ్‌వాల్ నిర్మాణం.. చేనేతల సంక్షేమం కోసం 11 ఎకరాల విస్తీర్ణంలో మెగా చేనేత పార్కు వంటి భారీ ప్రాజెక్టులతో మంగళగిరి అభివృద్ధిని లోకేశ్ పరుగులు పెట్టిస్తున్నారు. ఈ ఒరవడిలోనే మంగళగిరి ప్రజల ఆరోగ్యం కోసం వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని కూడా చేపడుతున్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.53 కోట్లను మంజూరు చేయడంతోపాటు నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను ఏపీఎంఎస్ఐడీసీకి అప్పగించి టెండర్లను పిలవడంతోపాటు కాంట్రాక్టును కూడా ఫైనలైజ్ చేయించింది. భార్గవ్ కనస్ట్రక్షన్స్ అనే సంస్థ ఆధ్వర్యంలో ఈ వంద పడకల ఆస్పత్రి నిర్మాణం జరుగనుంది. రాగల 15 రోజుల వ్యవధిలో శంకుస్థాపన జరిపించి ఏడాదిలోగా భవన నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రారంభించేలా ఏపీఎంఎస్ఐడీసీ చొరవ చూపాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు.

ఇక్కడ కాదు.. అక్కడ..!


వంద పడకల ఆస్పత్రి కోసం ఎంపిక చేసిన చినకాకాని క్యాన్సర్ హాస్పిటల్ ప్రాంగణం



- చినకాకానికి ప్రభుత్వాస్పత్రి తరలింపు
- క్యాన్సర్ హాస్పిటల్ ప్రాంగణంలో వంద పడకల ఆస్పత్రి
- రూ.53 కోట్లతో నిర్మాణం
- జీ ప్లస్ వన్ భవనసముదాయంగా ఏర్పాటు
- తరలింపును స్వాగతిస్తున్న ప్రజలు

మంగళగిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వంద పడకల ఆస్పత్రి అనేది మంగళగిరి ప్రజలకు ఎప్పటి నుంచో ఉన్న వాంఛ! 1986 ప్రాంతంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే దేవస్థానానికి ఎదురుగా నాలుగెకరాల విస్తీర్ణంలో 30 పడకల ప్రభుత్వాస్పత్రి భవనాన్ని ఏర్పాటుచేశారు. అయితే 15 ఏళ్ల నుంచి అది శిథిలమవుతూ రావడంతోపాటు వైద్యవిధాన పరిషత్ నిర్వహణలో కుంటుపడుతూ వచ్చింది. చివరకు భవనం కప్పంతా కారిపోతుండడం.. 30 పడకలకు బదులు కనీసం మూడు పడకలు కూడ లేనటువంటి దీనస్థితికి వచ్చింది. దీంతో మంగళగిరి ప్రజలకు ప్రైవేటు ఆస్పత్రులే దిక్కయ్యాయి. కొన్ని ప్రజాసంఘాలు పదేళ్లుగా మంగళగిరికి వంద పడకల ఆస్పత్రి కావాలంటూ పోరాడుతూ వచ్చాయి. రాష్ట్ర విభజన పుణ్యమో! లోకేశ్ వచ్చిన పుణ్యమో!! ఏదైతేనేమి!!! ఇన్నాళ్లకు వంద పడకల ఆస్పత్రి అనే చిరకాల వాంఛ నెరవేరే రోజు వచ్చింది.

చినకాకాని క్యాన్సర్ ఆస్పత్రి ప్రాంగణానికి తరలింపు

రూ.53 కోట్లతో చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తుండడంతో.. ఈ భవన నిర్మాణ విషయంలో మంత్రి లోకేశ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చిన సలహాలు..సూచనల మేరకు ఆస్పత్రిని ప్రస్తుత శిథిల భవనం స్థానంలో కాకుండా జాతీయ రహదారి వెంబడి చినకాకాని క్యాన్సర్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించాలని నిర్ణయించారు. చినకాకానిలో సర్వే నెంబరు 172/14లో పదెకరాల విస్తీర్ణంలో క్యాన్సర్ ఆస్పత్రి భవనం ఉంది. ఇది కూడా నిర్వహణ లోపంతో దాదాపు మూతపడిన దశలో ప్రాంగణమంతా నిరుపయోగంగా ఉంది. నగరంలో దేవస్థానానికి ఎదురుగా ఉన్న ప్రస్తుత ఆస్పత్రి స్థలంలో దీనిని నిర్మిస్తే భవిష్యత్తులో ఎన్నో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. అక్కడ ఆస్పత్రికి దారితీసే వీధులన్నీ చాలా ఇరుకుగా ఉన్నాయి. దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదాలు ఇతరత్రా ప్రమాదాల్లో మరణించినవారిని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తీసుకురావడం.. తీసుకుపోవడం శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ముందరగా జరపాల్సివస్తుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని మంత్రి లోకేశ్ నూతన ఆస్పత్రి భవనాన్ని క్యాన్సర్ హాస్పిటల్ ప్రాంగణంలో నిర్మించడమే సముచితమన్న నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలందరూ స్వాగతిస్తున్నారు కూడా!

ఆస్పత్రి రూపు రేఖలిలా..

చినకాకాని క్యాన్సర్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించనున్న కొత్త భవనాన్ని ప్రస్తుతానికి 5.5 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టాలని నిర్ణయించారు. లక్షా 20వేల చదరపు అడుగుల విస్తీర్ణం వచ్చే విధంగా గ్రౌండు అండ్ ఫస్ట్ ఫ్లోర్ భవనంగా దీనిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఆస్పత్రి భవనం చుట్టూ నాలుగు రోడ్లు రావడంతో ఉత్తరంవైపు ఈశాన్యంగా ప్రధాన ముఖద్వారాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ ముఖద్వారానికి భవనానికి మధ్య ఎకరం విస్తీర్ణంలో గ్రీనరీని ఏర్పాటు చేస్తారు. అలాగే పశ్చిమంగా ఉండే జాతీయరహదారి నుంచి ఆస్పత్రిలోకి దారి తీసేందుకు రెండో ప్రవేశ మార్గాన్ని ఏర్పాటుచేస్తారు. ఇవన్నీ నాలుగెకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతాయి. తూర్పువైపు మరో 1.5 ఎకరాల విస్తీర్ణంలో గ్రీనరీని ఏర్పాటుచేసి ఇందులో మార్చురీతోపాటు రోగుల బంధువులు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేస్తారు. అంటే ప్రస్తుతానికి 5.5 ఎకరాలను వినియోగిస్తారన్నమాట! మిగిలిన 4.5 ఎకరాలను ఆస్పత్రి భావి అవసరాల నిమిత్తం రిజర్వు చేసి ఉంచుతారు. ఆస్పత్రి డిజైన్‌లను ఖరారు చేసేందుకు దేశంలో ఉన్న ప్రధానమైన ప్రఖ్యాత ఆస్పత్రుల భవనాలను పరిశీలించి వాటిలో మెరుగ్గా ఉన్న డిజైన్‌లను పరిగణనలోకి తీసుకోవాలని కూడా మంత్రి లోకేశ్ ఇటీవలి సమీక్షలో అధికారులను ఆదేశించారు.

96మంది సిబ్బందితో..

ఆస్పత్రిలో సుమారు 24 మంది వైద్య నిపుణులు వివిధ విభాగాల్లో అందుబాటులో ఉంటారు. రెండో గ్రేడు నర్సింగ్ సూపరింటెండెంట్‌తో పాటు నలుగురు హెడ్ నర్సులు, 24మంది స్టాఫ్ నర్సులు ఉంటారు. వీరుగాక మరో 43 మంది సిబ్బంది వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తారు. మొత్తంగా 96మంది సిబ్బంది ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులను ఇచ్చింది.

నాణ్యతలో రాజీ పడేది లేదు : చిల్లపల్లి



వంద పడకల ఆస్పత్రిని చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నామని.. నిర్మాణ విషయంలో మంచి నాణ్యతా ప్రమాణాలను పాటించి తీరుతామని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు చెప్పారు. భవన నిర్మాణ పనులు ఏడాదిలోగా పూర్తి చేయాలన్న మంత్రి లోకేశ్ ఆదేశాలను తుచ తప్పకుండా పాటిస్తామన్నారు. మంగళగిరితోపాటు పిఠాపురంలో కూడ వంద పడకల ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. మంత్రి సత్యకుమార్ నియోజకవర్గం ధర్మవరంలో కూడ వంద పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

విజయకీలాద్రిపై ధ్వజారోహణ

- మంగళశాసనాలు అందించిన చినజీయర్ స్వామి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షలో సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో రెండవ రోజు సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ, సంతానం కావలసినవారికి గరుడ హోమం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం దేవతాహ్వానం, శేషవాహన సేవలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు చినజీయర్ స్వామి మంగళశాసనాలు అందించారు. ఆశ్రమ నిర్వాహకులు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు అనంతస్వామి, వేదవిద్యార్థులు పాల్గొన్నారు.


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న చినజీయర్ స్వామి

2029 నాటికి... బీబీనగర్‌కి డబ్లింగ్ పూర్తి

- ఈ ఏడాది 30 కిలోమీటర్ల పనిని పూర్తి చేస్తాం
- మరో 20 రోజుల్లో అందుబాటులోకి డొంకరోడ్డు మూడొంతెనల మార్గం
- గుంటూరు పశ్చిమ, తూర్పు టర్మినల్స్‌ని కలుపుతూ ఎఫ్‌వోబీ
- పాత్రికేయుల సమావేశంలో డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్(రెండో మార్గం) 2029 నాటికి పూర్తి చేస్తామని డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం సెక్షన్ల వారీగా గడువు సమయాన్ని నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే కుక్కడం - విష్ణుపురం మధ్యన 30 కిలోమీటర్ల సెక్షన్‌లో ప్రిలిమినరీ వర్కులు ప్రారంభమయ్యాయన్నారు. ఈ సెక్షన్‌ని ఏడాది లోపే పూర్తి చేసి కమిషనింగ్ చేస్తామన్నారు. అలానే 2026-27లో 96 కిలోమీటర్లు, 2027,-28లో 90 కిలోమీటర్లు, 2028-29లో 58.5 కిలోమీటర్ల డబ్లింగ్‌ని పూర్తిచేసి మొత్తం ప్రాజెక్టుని సంపూర్ణం చేస్తామన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులపై సోమవారం తొలుత వీడియో కాన్ఫరెన్స్‌లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ఆ తర్వాత దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడారు. అనంతరం గుంటూరు డివిజన్ ప్రాజెక్టులు, పనులపై డీఆర్ఎం రామకృష్ణ ఏడీఆర్ఎం కే సైమన్, గతిశక్తి సీపీఎం మనోహర్‌రెడ్డితో కలిసి పాత్రికేయుల సమావేశంలో వివరించారు.

- అమరావతి రాజధాని రైలుమార్గం(ఎర్రుపాలెం - నంబూరు)కు సంబంధించి రూ. 2047 కోట్ల అంచనా విలువతో గత ఏడాది మంజూరు చేయడం జరిగింది. దీనికి సంబంధించి 100 శాతం భూసేకరణ ఖర్చుని రైల్వే శాఖ భరిస్తున్నది. ఐదు నెలల్లో మట్టి పనులు ప్రారంభించేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టబోతున్నది. తొలుత నంబూరు - అమరావతి సెక్షన్ పనులు ప్రారంభమవుతాయని కన్‌స్ట్రక్షన్ డిపార్టుమెంట్ ద్వారా తెలిసిందని డీఆర్ఎం పేర్కొన్నారు.
- గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్‌లో క్లిష్టమైన దిగువమెట్ట - చలమ సెక్షన్‌లో అటవీ శాఖ, వన్యప్రాణి విభాగాల నుంచి అన్ని అనుమతులు వచ్చాయి. తొలుత చిన్న టన్నెల్ పనులు ఈ నెల మొదటి వారాంతంలో ప్రారంభిస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ సెక్షన్ పనులు పూర్తి చేసి గుంటూరు నుంచి నంద్యాల వరకు డబుల్ లేన్‌ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆ తర్వాత రైళ్ల ప్రయాణ సమయాన్ని అరగంట వరకు తగ్గించే చర్యలు తీసుకొంటామని చెప్పారు.
- నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గానికి సంబంధించి పొదిలి వద్ద కొంత భూసేకరణ సమస్య ఉన్నది. ప్రస్తుతానికి న్యూ పిడుగురాళ్ల నుంచి మల్లవరం వరకు పనులు పూర్తి అయ్యాయి. మల్లవరం - కనిగిరి మధ్యన 53 కిలోమీటర్ల సెక్షన్‌ని నిర్మించాలి. ఇందుకోసం సీఎం చంద్రబాబు స్పెషల్ టాస్కుఫోర్సుని కూడా నియమించారు. సాధ్యమైనంత త్వరగా భూసేకరణ సమస్య అడ్డంకిని తొలగించి కనిగిరి వరకు పనులు పూర్తి చేస్తాం. అప్పుడు కనిగిరి నుంచి ఈ సెక్షన్‌లో ప్యాసింజర్ రైళ్లను ప్రవేశపెట్టడానికి చర్యలు చేపడతామన్నారు.
- గుంటూరు నగరంలోని డొంకరోడ్డు మూడొంతెనల వద్ద ఆర్‌యూబీ ఎక్స్‌టెన్షన్ పనులు కొంత ఆలస్యమైన విషయం వాస్తవమే. ఊహించని విధంగా కార్పొరేషన్ పైపులైను షిఫ్టింగ్ వర్కు రావడం వలన జాప్యం జరిగింది. ఈ నెల 25వ తేదీ నాటికి ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి చేసి ఈ మార్గాన్ని రోడ్డు ట్రాఫిక్‌కి అందుబాటులోకి తీసుకొస్తాం. మొత్తం 58 ఆర్‌సీసీ బ్లాకులకుగాను 16 బ్లాకులు అమర్చాం. నగరంలో ట్రాఫిక్ సమస్య దృష్ట్యా వీటిని రాత్రి వేళ నల్లపాడు నుంచి ఇక్కడికి రవాణ చేయాల్సి వస్తున్నది. ఇదే సమయంలో మూడొంతెనల వద్ద ఆర్‌సీసీ బ్లాకులను నిల్వ చేసే స్థలం కూడా అందుబాటులో లేదు. దీని దృష్ట్యా రోజుకు నాలుగు బ్లాకులు తీసుకొచ్చి అమర్చుతున్నాం. ఆదివారం నల్లపాడు రోడ్డులో మిర్చి లారీల వలన తీవ్ర ఆటంకం కలిగింది. ఈ విషయాలను నగర ప్రజలు అర్థం చేసుకొంటారని ఆశిస్తున్నామన్నారు.
- గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు వైపున అన్ని హంగులతో ప్రయాణీకులకు సదుపాయాలు, స్టేషన్ భవనం ఆధునికీకరణ చేస్తున్నాం. మరో నాలుగు నెలల్లో ఈ పనులు పూర్తి అయ్యే అవకాశం ఉన్నది. ఇదే సమయంలో గుంటూరు పశ్చిమ వైపున సర్క్యులేటింగ్ ఏరియా నుంచి తూర్పు వైపున సర్క్యులేటింగ్ ఏరియా వరకు ఒక ఫుట్ వోవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నాం. ఇది కొంత జాప్యం కావొచ్చన్నారు. గుంటూరు యార్డు రీమోడలింగ్ మరో ఏడాదిలో పూర్తి అయ్యే అవకాశం ఉన్నది. అందులో భాగంగానే ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాం నిర్మిస్తున్నాం.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు రూరల్ వార్తలు

పశ్చిమ డెల్టాకాల్వకు 1818 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 76 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 203, తూర్పుకాల్వకు 141, పశ్చిమకాల్వకు 122, నిజాంపట్నం కాల్వకు 45, కొమ్మమూరు కాల్వకు 680 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

220 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 220 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ట ధర రూ.8,000 గరిష్ట ధర రూ.10,072 మోడల్ ధర రూ.10,072 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ట ధర రూ.8,000, గరిష్ట ధర రూ. 11,400 మోడల్ ధర రూ.11,400 పలికాయి.

గంజాయి కేసులో యువకుడి అరెస్టు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 17 నెలల క్రితం నమోదైన గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న యువకుడిని సోమవారం తాడేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. క్రైమ్ నెం.579/23 కేసులో అప్పట్లో ముగ్గురిని అరెస్టు చేయగా డోలాస్‌నగర్‌కు చెందిన ఎస్‌ఐ సైదా అనే యువకుడు పరారయ్యాడు. పక్కా సమాచారం మేరకు తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్‌ఐ ఖాజావలి, నిందితుడిని సోవవారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం మంగళగిరి కోర్టుకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అప్పులిచ్చిన వారి ఒత్తిళ్లు తట్టుకోలేక మనస్తాపం చెందిన ఓ వ్యక్తి వాట్సాప్‌లో సెల్ఫీ వీడియో పెట్టి గత నెల 29వ తేదీన ఆత్మహత్యానికి పాల్పడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఉండవల్లి గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి యాండ్రపల్లి ఆంజనేయులు (38) వ్యాపార అవసరాల నిమిత్తం పలువురి వద్ద అప్పులు తీసుకుని వడ్డీలు కడుతున్నాని, కానీ అప్పులిచ్చిన వారు ఒత్తిడి చేస్తుండటంతో పురుగుల మందు తాగానని వీడియోలో పేర్కొన్నాడు. అప్పులకు, కుటుంబ సభ్యులకు సంబంధం లేదని వారికి హాని కలుగకుండా చూడాలని పోలీసు అధికారులను కోరాడు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఆంజనేయులు మంగళగిరి ఎన్నారై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో ఎర్రబాలెం గ్రామానికి చెందిన ప్రేమ్, ఉండవల్లికి చెందిన ప్రసాద్, మణి, హరీష్‌లపై కేసు నమోదు చేసినట్లు తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు.

వసంత పంచమి వేడుకలు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలోని విజ్ఞాన విహార పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సామూహిక సరస్వతీ అష్టోత్తర పూజ జరిపించారు. అనంతరం విద్యార్థులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో వెనిగళ్ల సురేష్, సీహెచ్ రామమూర్తి, విష్ణురెడ్డి, మోక్షిత్‌రామ్, విశ్రాంత టీచరు ఎన్ అరుణ మాతాజీ, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో అక్షరాభ్యాసం

పెదనందిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక లయన్స్ మాంటిస్సోరీ సీబీఎస్ఈ పాఠశాలలో సోమవారం వసంత పంచమిలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. తొలుత అర్చకులు విఘ్నేశ్వర, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. అనంతరం తల్లులచే స్వయంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు శేషగిరిరావు, ప్రిన్సిపాల్ కిరణ్‌జోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని జడ్పీ బాలికల హైస్కూల్లో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని శ్రీసరస్వతీదేవి విగ్రహం వద్ద విద్యార్థినులు అలంకరించారు. అనంతరం హెచ్‌ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు సరస్వతీదేవికి పూలమాల వేశారు.



కియా సిరాస్ ఎస్‌యూవీ కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న డీటీసీ కె.సీతారామిరెడ్డి తదితరులు

గుంటూరు మార్కెట్లోకి కియా సిరాస్ ఎస్‌యూవీ

విజయవాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులోని సింహా మోటార్ సంస్థలో సోమవారం మార్కెట్లోకి కియా సిరాస్ ఎస్‌యూవీని విడుదల చేశారు. కారు విడుదల కార్యక్రమంలో గుంటూరు డీటీసీ కే సీతారామిరెడ్డి, ఎస్‌బీఐ డీజీఎం కృష్ణకుమార్ బీ ప్రభు, సింహా మోటార్స్ సేల్స్ హెడ్ ఎస్‌ఎల్ మారుతి కుమార్, సేల్స్ ఏజీఎం జీ క్రాంతి కుమార్‌లు పాల్గొన్నారు. 2019లో సింహా మోటార్ షోరూమ్ ప్రారంభించిన దగ్గర్నుంచి నాలుగు బ్రాంచీల ద్వారా ఇప్పటి వరకు 9721 కార్లను విక్రయించినట్లు మారుతీకుమార్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ నూతన సిరోస్ కారులో 12.3 అంగుళాల టచ్ స్క్రీన్, 12.3 అంగుళాల క్లస్టర్, 5 అంగుళాల ఏసీ కంట్రోల్స్ అన్ని కలిసి ఒకే 30 అంగుళాల ట్రినిటీ పానరోమిక్ డిస్‌ప్లే కలిగి ఉంటుందన్నారు. వీటితోపాటు వెనుక సీట్లో కూడా వెంటిలేషన్, రీక్లైనింగ్, స్లైడింగ్ సౌకర్యాలు కలిగి ఉంటాయన్నారు. 20 స్టాండర్డ్ భద్రతా ప్రమాణాలను కలిగి ఉంటాయన్నారు. పెట్రోల్, డీజిల్, ఆటోమేటిక్, మాన్యువల్ వేరియంట్స్‌లలో 8 ఆకర్షణీయమైన రంగుల్లో లభిస్తాయన్నారు. దీని ప్రారంభ ధర రూ.8,99,900 (ఎక్స్ షోరూం ధర)గా ఉందన్నారు. కార్ల బుకింగ్ కోసం సింహా మోటార్స్ షోరూంలో సంప్రదించవచ్చునని తెలిపారు.

సాగర్ జలాల కోసం ఎదురు చూపు

● నీళ్లు లేక ఎండిపోయిన కాల్వలు
● బెట్టకొస్తున్న పంటలు
● ఆందోళన చెందుతున్న మిర్చి రైతులు



సాగర్ నీళ్లు రాక ఎండిపోయిన పంట కాల్వ



బెట్టకొస్తున్న మిర్చి పంట



ఎండిపోతున్న సాగర్ నీటి కాల్వ

తాడికొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సాగర్ జలాలు చివరి భూములకు అందక పంటలు ఎండిపోయే దుస్థితికి వచ్చాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని చివరి భూములకు సాగర్ జలాలు అందటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే నాగర్జున సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల చేయటంతో పంటలు పండించుకోవటానికి అనువుగా ఉంటుంది. అయితే బండారుపల్లి మేజర్ కాల్వకు నీరు వచ్చినప్పుడు మూడు గేట్ల ద్వారా వివిధ గ్రామాలకు నీటిని విడుదల చేస్తారు. ఒక గేటు ద్వారా రావెల, రెండో గేటు ద్వారా పెదపరిమి, మూడో గేటు ద్వారా పొన్నెకల్లు వైపు నీటిని సమపాళ్లలో ఇరిగేషన్ సిబ్బంది విడుదల చేయాల్సి ఉంది. కానీ ఇరిగేషన్ అధికారులు సాగర్ జలాలు విడుదల చేయటంలో అలసత్వం వహించటంతో పాటు, వివక్ష చూపుతున్నారనే వాదనలు వినిపిస్తు న్నాయి. అయితే బండారుపల్లి మేజర్ కాల్వల్లో పూడికతీత పనులు ఇటీవల ప్రారంభించారు. కాగా మిర్చి పంటకు నీటి వసతి సక్రమంగా లేకపోవటంతో పంట ఎండిపోయే దుస్థితి నెలకొన్నది. దీంతో పూర్తిస్థాయిలో నీరు పొలాలకు అందటం లేదు.



చెరువులోని నీటిని ఇంజన్లతో తోడుతున్న దృశ్యం

సుమారు 2వేల ఎకరాలు సాగర్ కాల్వ నీటిపై ఆధారపడి సాగుచేస్తున్నారు. గేట్లను కొద్దిగా తెరిచి నీటిని విడుదల చేయటం వల్ల పొన్నెకల్లు, గరికపాడు చివరి భూములకు నీరందక పంటలు నాశనం అయ్యే స్థితికి చేరుకున్నాయి. అంతే కాకుండా కాల్వల్లో తూటుకాడ, కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి నీటి ప్రవాహం తక్కువగా ఉంటుంది. కొంత మంది రైతులు కాల్వల్లో అనాధికారికంగా పైపులను వేసు కొని నీటిని పక్కకు మరలిస్తున్నారు. దీనివల్ల నీరు వృథా అవుతున్నా ఇరిగేషన్ సిబ్బంది పట్టించుకోవటం లేదు. పొన్నెకల్లు, గరికపాడు, రావెల, బండారు పల్లి, బేజాత్‌పురం, పాములపాడు, తదితర గ్రామా ల్లో మిర్చి పంటను రైతులు పండిస్తున్నారు. మిర్చికి నీటి తడులు ఎక్కువగా కావాల్సి ఉంటుంది. కొద్ది మంది రైతులకు సాగర్ జలాలు అందటంతో కాపు బాగా వస్తుంది. నీరందని పొలాలు బెట్టకొస్తున్నా యి. అయితే రైతులు చేసేది లేక దగ్గరలోని చెరు వుల్లోని నీటిని ఇంజన్లతో తొడుకుంటున్నారు. దీంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది. ఇప్పటికే మిర్చి పంటకు ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. పంట బాగా పండి రేటు ఉంటే రైతు నష్టపోకుండా ఉంటారు. మిర్చికి రేటు ఉన్నా పంట సరిగా లేకపోతే రైతు నష్టపోయి అప్పుల ఊబిలోకి వెళ్లే పరిస్థితులు ఉన్నాయి. మిర్చిలో జెమిని వైరస్, ఎర్రనల్లి సోకటంతో పంటలు నాశనమవుతున్నాయని రైతులు పేర్కొన్నా రు. నీళ్లు సక్రమంగా అందక ఒక వైపు.. వైరస్ సోకి మరో వైపు పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగర్ జలాలను పూర్తి స్థాయిలో విడుదల చేసి, కాల్వల్లో పూడిక తీత పను లు చేయించాలని రైతులు కోరుతున్నారు.

వేడుకగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

● పెదవడ్లపూడికి పోటెత్తిన భక్తులు
● గ్రామంలో తిరునాళ్ల వాతావరణం
● సాయిబాబాను దర్శించుకున్న ప్రముఖులు
● అలరించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు



సాయిబాబాను దర్శించుకున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు

మంగళగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో కొలువైన భగవాన్ శ్రీసత్య షిరిడీ సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు, పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. సాయి నామస్మరణతో పెదవడ్లపూడి మార్మోగింది. సోమవారం వేకువజామున సాయిబాబాకి కాగడా హారతి, పాలాభిషేకం, అన్నాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకంతోపాటు రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మప్రచారక్ ఆధ్వర్యంలో అన్నాభిషేకం చేశారు. సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలు సాయిబాబాను దర్శించుకోగా, ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం, కమిటీ ప్రతినిధులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి బాబా వారి జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ బాబా మందిర వార్షిక వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, పాతూరి కృషితో మందిరం దక్షిణ షిరిడీగా పేరుగాంచిందని చెప్పారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి సిసోడియా, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి, ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, చీకోటి ప్రవీణ్, సిద్ధార్థ అకాడమీ చైర్మన్ రాజయ్య, అంకబాబు, కూటమి నేతలు గంజి చిరంజీవి, మధుకర్‌జీ, ప్రచారక్ భరత్‌జీ, మునగపాటి మారుతీరావు తదితరులు సాయిబాబాను దర్శించుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ గావించారు. సినీ సంగీత గాయకులచే సంగీత విభావరి, సినీ, టీవీ కళాకారులచే హాస్యవల్లరి, డూప్‌స్టార్స్, మ్యాజిక్ షో, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరించాయి. మందిరం నిర్వాహకులు పాతూరి శ్రీనివాసరావు, అన్నే శరత్, వైవీడీ ప్రసాద్, యేళ్ల ప్రవీణ్, అన్నే నంద కిశోర్, గడ్డిపాటి సాంబశివరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేడుకలకు సహాయ సహకారాలను అందించి జయప్రదం చేసిన భక్తులందరికీ ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్తిపాడులో కార్యాలయం మూసి.. గుంటూరులో విధులు

● హౌసింగ్ సిబ్బంది నిర్వాకం ● కార్యాలయం చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు



తాళాలు వేసి ఉన్న హౌసింగ్ కార్యాలయం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల్లో హౌసింగ్ స్కీమ్‌లకు ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యం ఉంది. ప్రభుత్వం అందించే ఈ పథకాల కోసం నిత్యం దరఖాస్తు చేసుకునేవారు గానీ, పథకాల అమలుకు సంబంధించి ఇసుక, ఇనుము, బిల్లుల కోసం హౌసింగ్ కార్యాలయానికి వచ్చే వారి సంఖ్య నిత్యం ఎక్కువగా ఉంటుంది. అలాంటి కార్యాలయాన్ని సిబ్బంది మూసి వేసి గుంటూరులో ఉన్న ప్రత్తిపాడు డీఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు హౌసింగ్ కార్యాలయానికి వచ్చి అధికారులు ఎప్పుడు వస్తారా అంటూ కార్యాలయం బయట ఎదురు చూడాల్సిన పరిస్థితి సోమవారం ఏర్పడింది. వాస్తవానికి ప్రత్తిపాడు హౌసింగ్ డీఈ కార్యాలయం ప్రత్తిపాడులోనే ఉండాలి. కాని గత ప్రభుత్వంలో ప్రత్తిపాడులో ఉన్న కార్యాలయాన్ని అప్పుడు ఉన్న రాజకీయ ప్రమేయంతో అధికారులు వారి సౌలభ్యం చూసుకుని గుంటూరుకు మార్చుకున్నారు. అప్పటి నుంచి ప్రత్తిపాడు హౌసింగ్ డీఈ కార్యాలయం గుంటూరులోనే ఉంటుంది. ఇటీవల ప్రత్తిపాడు వచ్చిన హౌసింగ్ పీడీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో ప్రత్తిపాడు డీఈకి మరో చోట ఇన్‌చార్జి కూడా ఇవ్వడం వల్ల గుంటూరులోనే కార్యాలయాన్ని నడుపుతున్నామంటూ సమాధానం వచ్చింది. త్వరలోనే ప్రత్తిపాడుకు డీఈ కార్యాలయాన్ని మారుస్తామంటూ పీడీ తెలిపారు. అయితే ప్రత్తిపాడు సిబ్బంది కార్యాలయాన్ని మూసి వేయడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఘనంగా అఖిలాండేశ్వరి ఆలయ వార్షికోత్సవం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి స్టేషన్ రోడ్డులోని శ్రీ అఖిలాండేశ్వరీ అమ్మవారి ఆలయ 17వ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అఖిలాండేశ్వరీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శ్రీచక్ర పూజ, కుంకుమార్చనలు, మంత్రపుష్పం పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కాలారి సుబ్బారావు, వసంత దంపతులు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, వీరయ్య చౌదరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చదువే ఉన్నతికి మార్గం

● పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కమిషనర్ కృష్ణతేజ



మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణతేజ

పెదనందిపాడు, ఫిబ్రవరి, 3 (ఆంధ్రజ్యోతి): చదువే ఉన్నతికి మార్గమని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణతేజ అన్నారు. మండలపరిధిలోని నాగులపాడు శ్రీనివాసా సీబీఎస్ఈ పాఠశాల 38వ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణతేజ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే విద్యతో పాటు ఆటల్లో రాణించాలని, కార్పోరేట్ పాఠశాలకు దీటుగా గ్రామీణ ప్రాంతంలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందించడం అభినందనీయమన్నారు. ఈ పాఠశాల ద్వారా ఎంతో మంది విద్యార్థుల ఉన్నతి బాటలు వేస్తున్న పాలకవర్గ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు నర్రా బాలకృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వంకాయల విద్యాసాగర్‌గుప్తా, గౌరవాధ్యక్షుడు దాసరి శేషగిరిరావు, కోశాధికారి డీఎల్ఎస్ ప్రసాద్, సభ్యులు దాసరి సత్యనారాయణ, కొల్లిపర ఉమా, ప్రిన్సిపాల్ శాంతకుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులను బాగుచేయించాలి

గ్రామంలో తాగునీటి చెరువులను బాగుచేయించాలని కోరుతూ నాగులపాడు గ్రామస్తులు కృష్ణతేజకు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు నాగులపాడులో ఓ ప్రయివేటు కార్యక్రమానికి విచ్చేసిన కమిషనర్ కృష్ణతేజకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రెండు చెరువులు ఉన్నాయని, రెండింట్లో నీరు రంగు మారి, దుర్వాసన వస్తోందని, ఈ నీటి ద్వారా వ్యాధుల బారినపడుతున్నామని, చెరువుల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. ఇటీవల కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కూడా వినతిపత్రం అందజేసి సమస్యను తెలియజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బండి నాగబాబు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, నాయకులు కలవకూరి వెంకట్రావు, రాజు, కాపు వెంకటసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మా పాఠశాలను మా కాలనీలోనే ఉంచాలి

● యనమదల రాజీవ్‌నగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి



ఎంపీడీవో శివపార్వతి, ఎంఈవో రమాదేవిలకు సమస్యను తెలియజేస్తున్న యనమదల రాజీవ్‌నగర్ కాలనీవాసులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మా కాలనీలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాలను అక్కడి నుంచి మార్పు చేయవద్దని యనమదల రాజీవ్‌నగర్ కాలనీవాసులు ఎంపీడీవో శివపార్వతి, ఎంఈవో రమాదేవిలను వేడుకున్నారు. యనమదలలోని ఎస్సీ కాలనీలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాలను మోడల్ పాఠశాలగా మార్పు చేశారు. ఈ మోడల్ పాఠశాలలో ముప్పై మంది విద్యార్థులు ఉన్న రాజీవ్‌నగర్ కాలనీ పాఠశాలను కలుపుతూ ప్రతిపాదనలు చేశారు. దీనిపై విద్యార్థులు తల్లిదండ్రులు సోమవారం ఎంపీడీవో శివపార్వతి కలుసుకుని తమ ఇబ్బందులు తెలిపారు. మా కాలనీ నుంచి ఆ పాఠశాలకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుందని, మధ్యలో చెరువు కూడా ఉందని, వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని దీని వల్ల పిల్లల భద్రతకు ప్రమాదం ఉందని వారు ఎంపీడీవోకు విన్నవించారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి : ఎంపీడీవో యుగకీర్తి

కాకుమాను, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పది విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపీడీవో యుగకీర్తి అన్నారు. కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం పౌష్టికాహారం దాతల సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీవో యుగకీర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడానికి పౌష్టికాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఇస్రో శాస్త్రవేత్త నూతి సత్యనారాయణ, ఎంఈవోలు కెన్నడీ, విజయభాస్కరరావు, హెచ్‌ఎం సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెదనందిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-పర్చూరు రహదారిలో అబ్బినేనిగుంటపాలెం వద్ద సోమవారం ఆగిఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం పర్చూరు మండలం అడుసుమల్లికి చెందిన ఊట్ల నాగేశ్వరరావు గుంటూరు నుంచి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆగి ఉన్న లారిని వెనుకనుంచి ఢీకొని అదుపుతప్పి పడిపోయాడు దీంతో తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ మధుపవన్ వివరాలు సేకరించారు.

ఎర్రబాలెంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

● హాజరైన మంత్రి లోకేశ్ ● స్వాగతం పలికిన కూటమి నేతలు



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికిన ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెంలో శ్రీముత్యాలమ్మ, శ్రీపోతురాజు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. తొలుత ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు, కూటమి నేతలు లోకేశ్‌కు ఘన స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయంలోనికి ప్రవేశించి శ్రీముత్యాలమ్మ, శ్రీపోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠను తిలకించి.. తీర్థప్రసాదాలను స్వీకరించారు. వేద పండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందజేశారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై మంత్రి లోకేశ్‌కు అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, మాజీ సర్పంచ్ భీమవరపు శ్రీనివాసరావు, ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

● వ్యవసాయ కార్మికసంఘ నాయకుల డిమాండ్

పెదనందిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కామోన్మాది చేతిలో మృతిచెందిన యార్ల రమణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. గ్రామాల్లో ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు అమలు చేయాలని, గతంలో కూడా పలుమార్లు వృద్ధులపై అఘాయిత్యాలకు పాల్పడ్డాడని, పోలీసుశాఖ తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రాంతంలో రాత్రివేళల్లో నిర్మానుష్యంగా, చీకటిమయంగా ఉండడంతో దుండుగులు సంచరిస్తున్నారని, దీంతో ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. నివాళులర్పించిన వారిలో జంపని రామారావు, వెంకటసుబ్బారావు తదితరులున్నారు.

లక్ష్యాలను ఏర్పరచుకున్నప్పుడే విజయం సాధ్యం

తాడేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవితంలో విజయం సాధించాలంటే లక్ష్యాలను ఏర్పరచుకున్నప్పుడే విజయం సాధ్యం అవుతుందని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విజయవాడ గుణదల 16వ డీ లయన్ అన్నపురెడ్డి కోటిరెడ్డి అన్నారు. సోమవారం పెనుమాకలోకి వందేమాతరం జడ్పీ హైస్కూల్లో జరిగిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో భాగంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పూర్ణ చంద్రశేఖరరావు, లయన్ టీ దుర్గామల్లేశ్వరరావు, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు, కాకుమాను జోజప్ప, ఉపాధ్యాయులు సత్యనారాయణరాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వక్తలు, ప్రిన్సిపాల్ రామారావు

తాడికొండ(లాం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా రోజువారీ జీవితంలో క్యాన్సర్ నివారణ పద్ధతులపై లాం చలపతి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు అమెరికన్ అంకాలజీ డీఎం డాక్టర్ బీ మీను చంద్ర మాట్లాడుతూ లంగ్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌లతో ఎక్కువగా బాధింపబడుతున్నారని తెలిపారు. క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ప్రతిరోజు అలవాట్లలో తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి అన్నారు. రోజుకు కనీసం 30 నిమిషాలు వ్యాయామం, యోగా, జాగింగ్, వాకింగ్, సాధారణ వ్యాయమాలు క్రమం తప్పకుండా చేయాలన్నారు. హెచ్‌పీవీ, హైపటైటీస్ బీ వంటి వ్యాక్సినేషన్లు తీసుకోవటం మంచిదన్నారు. క్యాన్సర్ ఒక సవాలుగా మారుతున్న ఆరోగ్య సమస్య అని ముందుస్తు నిర్ధారణ, సకాలంలో చికిత్సతో అదుపు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, గుం టూరు ఐడీఏ ప్రెసిడెంట్ డాక్టర్ సౌజన్య, సెక్రటరి ఎన్ ఆదిత్య, సుబ్బానాయుడు, సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పల్సస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కనమర్లపూడి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 3: పొన్నూరు పల్సస్ ఎక్స్‌పోర్ట్ మర్చంట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కనమర్లమూడి సత్యనారాయణ సోమవారం ఎన్నికయ్యారు. స్థానిక పల్సస్ మర్చంట్ అసోసియేషన్ హాల్లో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా సత్యనారాయణ ప్రధాన కార్యదర్శిగా వక్కలగడ్డ మోహన్‌రావు కోశాధికారిగా నారాయణం మేఘనాథ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పొన్నూరు పట్టణం అపరాల వ్యాపారానికి ప్రసిద్ధి చెందిందన్నారు. అపరాల వ్యాపారంలో పొన్నూరును మరింత ముందుకు తీసుకు వెళ్లేలా తమ కార్యవర్గం పనిచేయనున్నట్లు చెప్పారు. నూతన కార్యవర్గ సభ్యులను అపరాల వ్యాపారులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ తదితరులు అభినందించారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



నందివెలుగులో గాయత్రి అమ్మవారిని పూజించి, పారాయణంలో పాల్గొన్న భక్తులు, ప్రత్యేక అలంకారంలో రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి వారు

తెనాలి అర్బన్, తెనాలి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రూరల్ మండలం నందివెలుగు సాయి క్షేత్రంలో గాయత్రి అమ్మవారిని సరస్వతిగా అలంకరించి పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు, లలితా సహస్రనామ పారాయణ, మణిదీప వర్ణం కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి సన్నిధిలో ఉంచి పూజించిన నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, ఎగ్జామ్స్ ప్యాడ్స్ బాలబాలికలకు పంపిణీ చేశారు. అమ్మవారి కంకణాన్ని అందించి ఆశీర్వదించారు. బాబావారికి మధ్యాహ్న హారతి ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో షిరిడి సాయి స్వచ్ఛ సేవా ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ ఎంవీ హరిప్రసాదరావు, కార్యదర్శి శివపల్లి, అన్నపూర్ణ, శారదా చలపతి, నాగలక్ష్మి, సాంబశివరావు, పార్వతి, కోటేశ్వరమ్మ, శుభశ్రీ, నాగేశ్వరరావు పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరులో కోటి తులసిదళ అర్చన

తెనాలి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో కొలువుదీరిన రాజ్యలక్ష్మీసమేత చెన్నకేశవస్వామికి కోటి తులసి దళ అర్చన కార్యక్రమాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. సోమవారం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివార్లకు ప్రత్యేక పూజాలు న్విహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్ల కల్యాణమూర్తులను తోడ్కొని వస్తున్న పద్మశాలీయులు

వైభవంగా భావనరుషి స్వామి కల్యాణం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భద్రావతి సమేత భావనరుషి స్వామి వారి కళ్యాణం సోమవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లో ప్రధాన వేదికపై స్వామి అమ్మవార్ల కళ్యాణ మూర్తులను ఉంచి కళ్యాణం జరిపించారు. మేళతాళాలతో అలంకరించిన వాహనంపై కళ్యాణమూర్తులను ఉంచి ఊరేగింపుగా కళ్యాణవేదిక వద్దకు పద్మశాలీయులు తోడ్కొని వచ్చారు. కళ్యాణం అనంతరం మహిళలకు రవిక, పసుపు, కుంకుమ, ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేశారు. పెద్దశ్రేష్టులు సత్యనారాయణ, కోటేశ్వరరావు, వరప్రసాద్, ట్రస్ట్ సభ్యులు రామలింగేశ్వరరావు, ధనలక్ష్మి, చంద్రశేఖరరావు, వెంకటరమణ, వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు హరిగోపాల్, మదన్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటేషన్ సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక మారీసుపేట ఎరువుల కొట్లు బజార్‌లో జరుగుతున్న శానిటేషన్ పనులను అధికారులతో కలసి కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శేషన్న మాట్లాడుతూ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుటున్నట్లు తెలిపారు. వ్యాపార సంస్థల నుంచి వచ్చే వ్యర్థాలను పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. సుందర తెనాలికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య పనులపై అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ శేషన్న

డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించండి

● మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బందిని అదేశించారు. సోమవారం పురపాలక సంఘం పరిధిలోని 13, 19వ వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్లను ఆక్రమించి ర్యాంపులను నిర్మించడాన్ని గమనించి ఆక్రమణలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. పట్టణ సుందరీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

సచివాలయంలో తనిఖీ

స్థానిక రజకపేటలోని 38వ వార్డులోని సచివాలయాన్ని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు సోమవారం ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా బీఎల్‌వో రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఇంటి, నీటి, ఖాళీస్థలాల పన్నులను నిర్ణీత గడువులోపు పురపాలక సంఘంలో జమచేసి తగు రసీదును పొందాలని సూచించారు. వ్యాపార సంస్థలు తమ ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని లేనివారు నూతన ట్రేడ్ లైసెన్స్‌లను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవతామూర్తులకు పట్టు వస్త్రాల సమర్పణ

బాపట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బాపట్ల నరాలశెట్టివారిపాలెంలోని అష్టలక్ష్మీ దేవస్థానం 8వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నరాలశెట్టివారిపాలెం గ్రామాలయం, గ్రామదేవత శ్రీపోలేరమ్మ ఆలయం, శ్రీరాజ్యలక్ష్మీసమేత క్షీరభావన్నారాయణ స్వామి ఆలయం, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయంలో పట్టు వస్త్రాలను అష్టలక్ష్మి దేవస్థాన ఆలయ కమిటీ సభ్యులు, నరాలశెట్టివారిపాలెం గ్రామ మహిళలు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు, పక్కన శివకుమార్ తదితరులు

జగన్‌ను మళ్లీ సీఎం చేయటమే లక్ష్యం

● జిల్లా వైసీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేయటమే లక్ష్యమని, ఆ బాధ్యత పార్టీ శ్రేణులపైనే ఉందని మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో వైసీపీ నియోజవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో నూతంగా పదవులు పొందిన కార్యవర్గసభ్యులను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదలకు లబ్ధిచేకూర్చేలా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని పారదర్శకంగా అందించిన ఘనత వైసీపీదేనన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చిత్తశుద్ధి కనబరచడం లేదని ఆరోపించారు. గతంలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలనను కూటమి ప్రభుత్వం నీరుగార్చి పేదలను ఉసూరుమనిపిస్తోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ నియోజవర్గంలో పార్టీ ఆవిర్భావంలో పెద్దగా కార్యకర్తలు లేరని అంచలంచలుగా ఎదిగి వైసీపీ జెండాను ఎగరవేశామన్నారు. అంతకు రెట్టింపు పట్టుదలతో రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరం కలిసికట్టుగా పనిచేసి ఎంపీ స్థానాన్ని సైతం వైసీపీ కైవసం చేసుకునేలా పనిచేద్దామన్నారు.

కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు లేళ్ళ అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పత్రిపాడు నియోజవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్‌వలి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మొట్టు వెంకటప్పరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న కార్మికులు

కుమార్ పంప్స్ సంస్థ కార్మికుల రక్తదానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణ పరిధిలోని సుల్తానాబాద్‌లో కుమార్ పంప్స్ పరిశ్రమలో కార్మికులు సోమవారం రక్తదానం చేశారు. ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం సతీమణి వసుంధర పుట్టినరోజు పురస్కరించుకుని సిబ్బంది 100 యూనిట్ల రక్తదానం చేశారు. ముందుగా డీఎస్పీ బీ జనార్ధనరావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు రక్తం ఎంతగానో అవసరమన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉండే రోగుల ప్రాణాలను కాపాడటంలో రక్తదాతల తోడ్పాటు ఉంటుందన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి, కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, కృష్ణకుమార్, హరికుమార్, శేషుకుమార్, శేషగిరిరావు, శ్రీహాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ నిర్వాహకులు

బాల్య వివాహాల నిరోధానికి ప్రచారం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి3: బాల్య వివాహాల నిరోధానికి పోరాటం సాగిస్తామని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు డి.అక్కయ్య అన్నారు. మండల పరిధిలోని బ్రహ్మణకోడూరు, వెల్లలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల వ్యతిరేక ప్రచార కార్యక్రమం వీధి నాటక ప్రదర్శన జరిగింది. బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించారు. చిన్న వయసులో జరిగే వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు గ్రామస్థులు పాల్గొన్నారు.



దేవిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దేవిరెడ్డికి ఘన నివాళి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం పోస్టల్ యూనియన్ నేత దేవిరెడ్డి శివనాగేశ్వరరావు కృషి చేశారని పలువురు వక్తలు చెప్పారు. గాంధీ నగర్‌లోని ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం డీఎస్ఎన్ సంతాప సభ నిర్వహించారు. సీపీఎం సీనియర్ నేత ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ, పోస్టల్ ఎంప్లాయీస్, టెలిఫోన్ ఎంప్లాయీస్ కోసం సొసైటీ స్థాపించి ఎన్నో సేవలు అందించారని చెప్పారు. పి.పోలేశ్వరరావు, శివకుమారి, సత్యనారాయణ, సుబ్బారావు, రమేష్, సీతారామయ్య ప్రసంగించారు.

బగళాముఖి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

చందోలు (పిట్టలవానిపాలెం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలోని శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో శ్రీపంచమి సందర్భంగా బాలబాలికలకు అక్షరాభ్యాస కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. శ్యామలా నవరాత్రులలో భాగంగా 5వ రోజున వచ్చే శ్రీపంచమి రోజున బాలబాలికలకు అక్షరాభ్యాసాలు నిర్వహించటం ఎంతో విశేషమని వేదపండితులు తెలిపారు. తల్లిదండ్రులు చిన్నారులను తీసుకొచ్చి సరస్వతీ పూజ నిర్వహించి కంకణాలు ధరింపజేశారు.

శ్రీమద్రామాయణ జ్ఞానయజ్ఞ మహోత్సవాలు ప్రారంభం

కొల్లూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 56వ శ్రీమద్రామాయణ జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కొల్లూరులోని శంకరసేవా సమితి ఆధ్వర్యంలో గోవర్ధన మండపంలో శ్రీమద్రామాయణ గ్రంథ శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండ జ్యోతి ప్రజ్వలన, మంటపారాధన నిర్వహించారు. అనంతరం తంగిరాల రాజేంద్ర ప్రసాద్ శర్మ రామాయణాన్ని ప్రవచనం చేశారు. మల్లాది శివరామకృష్ణమూర్తి రామాయణాన్ని పారాయణం చేశారు. ఆయా కార్యక్రమాలను శంకర సేవా సమితి సభ్యులు భాగవతుల సూర్యనారాయణ మూర్తి, కల్లూరు వెంకటసూర్యనారాయణ మూర్తి పర్యవేక్షించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ఎండాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీ కొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ సంఘటన పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కొల్లూరు మండలం జువ్వలపాలేనికి చెందిన కంచర్ల యేసుబాబు (25) విజయవాడలోని టెన్నిస్ కోర్టులో పనిచేస్తూ సుమారు 20 రోజుల కింద ట విశాఖపట్నం సమీపంలోని మధురవాడ సాయిప్రియ గార్డెన్స్‌లో ఉన్న మైల్‌స్టోన్ టెన్నిస్ కోర్టులో చేరాడు. ఇతడు సోమవారం ద్విచక్రవాహనంపై కారుషెడ్డు కూడలి నుంచి సర్వీసు రోడ్డులో పీఎంపాలెం వైపు వస్తుండగా మితిమీరిన వేగంతో వచ్చిన ఓ ఆటో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో యేసుబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని గీతం ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసికట్టుగా పని చేసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో సోమవారం బాపట్ల నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు సూచనలను నాయకులకు, కార్యకర్తలకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు తూర్పు ముఖ ద్వార దర్శనం

అల్లూరు (పిట్టలవానిపాలెం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 4న రథసప్తమి పర్వదినం సందర్భంగా ఉదయం 6గంటలకు స్వామి వారు రథశాలలో తూర్పు ముఖంగా భక్తులకు స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసవర్మ తెలిపారు. సాయంత్రం స్వామి వారు గ్రామోత్సవానికి తరలివెళతారన్నారు.



పంచముఖి వారాహి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న పండితులు

ఘనంగా పంచముఖి వారాహి విగ్రహ పునః ప్రతిష్ఠ

కొల్లిపర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర పంచముఖి వారాహి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం నుంచి ఆలయం ఎదుట అర్చకుల హోమాలతో, వేద మంత్రోచ్చరణలతో మార్మోగింది. పరమ యోగి హర్షిత్ మహారాజ్ ఆధ్వర్యంలో ఉదయం 8.45గంటలకు గణపతి, అష్ట భైరవులు, అష్టమాతృకసహిత పంచముఖి వారాహి అమ్మవారు, దశమహావిద్యసహిత శ్రీకామాఖ్య అమ్మవారు విగ్రహాలను పండితులు పునఃప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా పరమయోగి హర్షిత్ మహారాజ్ మాట్లాడుతూ వరాహిరూపం ఇంచుమించు వరాహమూర్తినే పోలి ఉంటుందన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని 4వ తేదీన 9.30 గంటలకు మహా చండి హోమం, 5న సాయంత్రం 3గంటలకు కామాఖ్య కామ్యసిద్ధి హోమం, 6న ఉదయం 9గంటలకు నవసుగంధ ద్రవ్యాలతో శ్రీవారాహి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠా మహోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. 10వేల మందికి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

జిల్లా స్థాయి పోటీలలో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 3: జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలలో నారాకోడూరు పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాస ఉత్సవాల సందర్భంగా గుంటూరు విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా భవన్‌లో జిల్లా స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొని ట్రాఫిక్ రూల్స్ రోడ్డు భద్రతా అనే అంశంపై వ్యాసరచన పోటీలలో పాల్గొన్నారు. కె యశ్వినీ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. క్విజ్ పోటీలలో కే హారిక, కే భవ్య, శ్రీలహరి, బృందం తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులను గుంటూరు కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి ఆవుల తిరుమలేష్ ఊర్దూ డీబీఈఈ ఎండీ కాసిం, మణికుమార్, శివకుమార్, తదితరులు అభినందించి బహుమతులు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.



ఇండియన్ ఐకాన్ పురస్కారం అందుకుంటున్న ఉమాశంకర్

ఉమాశంకర్‌కు ఇండియన్ ఐకాన్ పురస్కారం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 3: మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్‌కు ఇండియన్ ఐకాన్ పురస్కారం లభించింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం జరిగింది. పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా తిరుమలశెట్టి ఉమాశంకర్ చేస్తున్న సేవా కార్యక్రమాలు రక్తదాన శిబిరాల నుంచి ఈ పురస్కారం అందించారు. సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మండలి లక్ష్మణ్‌బాబు, చైర్మన్ రాజకుమార్, జాతీయ అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్, తదితరులు పాల్గొని పురస్కారాన్ని అందజేశారు.



భూమి పూజలో పాల్గొన్న కాంతారావు, మద్దాళి గిరిధర్, తదితరులు

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

చేబ్రోలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు గ్రామంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ ఘనంగా జరిగింది. స్థానిక వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న నిత్యానంద ఆశ్రమ సేవా సంఘం స్థలంలో వాసవి కన్యకా పరమేశ్వరి, శారదా అమ్మవారు, ఆది శంకరాచార్యుల నూతన ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో శివస్వామి, మాజీ ఎమ్మెల్యే మాద్దాళి గిరిధర్‌రావు, వ్యాపారవేత్త గ్రంధి కాంతారావు, ఆర్యవైశ్య ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట ధ్వంసంచేసి రహదారి నిర్మాణం

● దీనిపై ప్రశ్నించినందుకు దాడి చేశారని బాధితుడు ఫిర్యాదు

కొల్లూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తన పొలంలో మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి రహదారి నిర్మించారని ఓ రైతు ఆరోపించాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జువ్వలపాలెం గ్రామానికి చెందిన ఓ పారిశ్రామికవేత్త తన అనుచరులతో అదే గ్రామానికి చెందిన మారీదు ప్రసాద్ అనే రైతుపై దాడి చేయడంతో పాటు తన పొలంలో మొక్కజొన్న పంటను జేసీబీ సాయంతో ధ్వంసంచేసి తన పట్టా భూమిలో నుంచి రహదారి నిర్మాణం చేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు అయిన గాయాలను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ నిబంధనల మేరకు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశానని, పోలీసు ఉన్నతాధికారులు తనపై జరిగిన దాడి గురించి విచారించి నిందితులపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.